ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 7 జూన్ 2024


పొలాల్లో ఆరుద్ర పురుగుల సంచారం

ఖరీఫ్ సీజన్ ప్రారంభం

సకాలంలో రుతు పవనాలు ఆగమించాయి. ఖరీఫ్ సాగు ఆరుద్ర కార్తెతో ప్రారంభమవబోతోంది.ఇందుకు చిహ్నంగా ఆరుద్ర పురుగులు పొలాల్లో దర్శనమిస్తున్నాయి. పొలాలు దుక్కి, దున్ని ఆరుద్ర కార్తె ప్రారంభానికి రైతులు సాగు పనులకు శ్రీకారం చుడతారు.కారణం ఆరుద్ర కార్తెలో వేసిన విత్తనాలకు మంచి పంట దిగుబడి వస్తుంది. అదునుకు సాగు చేయడంలోనే పంట దిగు బడి ఆధార పడి ఉంటుంది. ఖరీఫ్ అదును వచ్చేసిందని తెలియజెప్పేందుకు ఆరుద్ర పురుగులు వారం నుంచీ పక్షం రోజుల వరకూ పొలాల్లో సంచరిస్తూ రైతన్నను సాగుకు ప్రోత్సహిస్తుంటాయి.అయితే ప్రస్తుత ఆధునిక వ్యవసాయంతో నేల విష రసాయనాలతో కలుషితం కావడంతో ఆరుద్ర పురుగు ఉనికే కనుమరుగవుతుండడం విషాదం.

- ఎర్రావారిపాలెం

జిల్లావ్యాప్తంగా వర్షాలు

తిరుపతి(కలెక్టరేట్),జూన్ 6: జిల్లావ్యాప్తంగా గురువారం వర్షాలు కురిశాయి. ఎండ వేడిమికి అల్లాడిన జనానం వర్షంతో కాస్త ఉపశమనం పొందారు.మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.గురువారం ఉదయం ఎనిమిది గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. అత్యధికంగా వడమాలపేటలో 84.4మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. తిరుపతి అర్బన్‌లో 68.2, సూళ్లూరుపేటలో 55.4, నారాయణవనంలో 52.8, దొరవారిసత్రంలో 43.6, కేవీబీపురంలో 40.4, తిరుపతి రూరల్‌లో 36.2, రామచంద్రాపురంలో 34.2, పుత్తూరులో 33.8, బాలాయపల్లిలో 33.8, రేణిగుంటలో 32.4, గూడూరులో 32.2, చిన్నగొట్టిగల్లులో 29.8, పెళ్లకూరులో 26.4, చంద్రగిరిలో 22.2, పిచ్చాటూరులో 21.4, వాకాడులో 20.4, ఎర్రావారిపాళెంలో 20.4, ఓజిలిలో 17.6, చిట్టమూరులో 15.8 మి.మీ వర్షపాతం నమోదయ్యింది.

నైరుతురాగాలు



ఎండ వేడి.. ఎన్నికల వేడి.. రెండూ చల్లబడ్డాయి. కనిపించని మేఘాలు ఈవీఎం పెట్టెల్లో కురిపించిన ఓట్లవాన వెల్లువై అరాచకపాలన అంతమైపోగా, కమ్ముకొచ్చిన కారుమబ్బులు కుండపోతగా మారి పుడమి తల్లి దాహం తీరుస్తున్నాయి. శిఖరాలతో ఊసులాడి, అడవిని ముద్దాడి తేలాడుతున్న మబ్బులు ఉండి ఉండీ కురిపిస్తున్న జల్లులతో తిరుమల కొండలు కొత్త అందాలను సంతరించుకున్నాయి. శ్రీనివాసుడి దర్శనం కోసం వస్తున్న భక్తులకు మనోల్లాసం కలిగిస్తున్నాయి. ముసురు వానల్లో తడిసి ముద్దవుతున్న చెట్టూ చేమతో పాటూ జనజీవన సౌందర్యం చూసి ప్రకృతి పులకిస్తోంది. గురువారం నాటి కొన్ని వాన అందాల చిత్రాలు ఇవి..





టీడీపీకి పూర్వవైభవం

కూటమికిది చరిత్రాత్మక విజయం

ఎన్టీఆర్ నాటి ప్రభంజనాలకు చేరువైన పార్టీ



తిరుపతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో టీడీపీ కూటమి చరిత్రాత్మక విజయం నమోదు చేసింది. సూటిగా చెప్పాలంటే పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు నాటి ప్రభంజనాలకు ఈసారి టీడీపీ కూటమి చేరువగా వచ్చింది. మొత్తం 14 అసెంబ్లీ స్థానాలకు గానూ 12 స్థానాలను కూటమి గెలుచుకుంది. దీనితో పాటు చిత్తూరు ఎంపీ సీటు దక్కించుకుని జిల్లాలో పూర్వ వైభవాన్ని సాధించింది. టీడీపీ ఆవిర్భవించాక 1983లో జరిగిన తొలి ఎన్నికల్లో అప్పటికి 15 అసెంబ్లీ స్థానాలున్న ఉమ్మడి జిల్లాలో ఏకంగా 14 స్థానాలను గెలుచుకుని చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. అప్పట్లో తంబళ్ళపల్లె మినహా మదనపల్లె, వాయల్పాడు, పీలేరు, చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, నగరి, పుత్తూరు, వేపంజేరి, చిత్తూరు, పలమనేరు, కుప్పం, పుంగనూరు అసెంబ్లీ స్థానాలలో ఎన్టీఆర్ ప్రభంజనంతో టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. అలాగే అప్పట్లో జిల్లాకు సంబంధించి చిత్తూరు, తిరుపతి, రాజంపేట ఎంపీ స్థానాలను కూడా కైవసం చేసుకుంది.ఆ తరహా ప్రభంజనాన్ని టీడీపీ మళ్ళీ 1994లో ప్రదర్శించింది. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో మొత్తం 15 అసెంబ్లీ స్థానాలకు చిత్తూరు మినహా 14 స్థానాలనూ గెలుచుకుంది. చిత్తూరులో సీకే బాబు స్వల్ప ఆధిక్యతతో గెలిచి కాంగ్రెస్ ఉనికి కాపాడారు. తర్వాతెప్పుడూ జిల్లాలో టీడీపీ మెజారిటీ స్థానాలు సాధించింది లేదు. చివరికి చంద్రబాబు ముఖ్యమంత్రిగా వుండగా జరిగిన 1999, 2004 ఎన్నికల్లో కూడా మెజారిటీ స్థానాలు కాంగ్రెస్‌కే దక్కాయి. ఇక 2014 ఎన్నికల్లో టీడీపీ గెలిచి చంద్రబాబు మళ్ళీ సీఎం అయినప్పటికీ జిల్లాలో మాత్రం యథాప్రకారం ప్రతిపక్షమైన వైసీపీకే అత్యధికంగా ఎనిమిది సీట్లు దక్కాయి. ఇక 2019 ఎన్నికల్లో మొత్తం 14 అసెంబ్లీ స్థానాలకు గానూ టీడీపీకి కుప్పం ఒక్కటే దక్కింది. మిగిలిన 13 సీట్లూ వైసీపీ పరమయ్యాయి. తాజా ఎన్నికల్లో టీడీపీ మళ్ళీ ప్రభంజనం సృష్టించింది. 14 స్థానాల్లో రెండు మినహా 12 స్థానాలూ టీడీపీ స్వీప్ చేసింది. చిత్తూరు ఎంపీ సీటు కూడా కైవసం చేసుకుంది. పుంగనూరు, తంబళ్ళపల్లె సెగ్మెంట్లను కూడా స్వల్ప తేడాతోనే కోల్పోయింది.

అభ్యర్థులు సైతం ఊహించని భారీ ఆధిక్యతలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి తాజా ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు చాలావరకూ భారీ ఆధిక్యతలు సాధించారు. తిరుపతిలో కూటమి తరపున జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు అత్యధికంగా 61 వేలకు పైగా మెజారిటీ తెచ్చుకోగా కుప్పంలో చంద్రబాబుకు 48 వేలకు పైగా, నగరిలో గాలి భానుప్రకాష్‌కు 45 వేలకు పైగా, చంద్రగిరి, శ్రీకాళహస్తిల్లో పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి 43 వేలకు పైగా ఆధిక్యత సాధించారు. జీడీనెల్లూరులో థామస్ 26 వేలకు పైగా, పీలేరులో నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి 25 వేలకు పైగా మెజారిటీ దక్కించుకున్నారు.పలమనేరులో అమరనాథరెడ్డి 20 వేలకు పైగా, పూతలపట్టులో మురళీమోహన్ 15 వేలకు పైగా, చిత్తూరులో జగన్మోహన్ 14 వేలకు పైగా ఆధిక్యత పొందారు. మదనపల్లెలో షాజహాన్ 5 వేలకు పైగా, సత్యవేడులో ఆదిమూలం 3 వేలకు పైగా తేడాతో గెలుపొందగా వీరిద్దరి ఆధిక్యతే తక్కువ. ఈ రెండు చోట్లు మినహా 10 స్థానాల్లో ఇంత భారీ మెజారిటీలను గెలిచిన అభ్యర్థులు కూడా ఊహించలేదు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సమీక్ష

సెగ్మెంట్	2014 టీడీపీ ఓట్లు	2014 వైసీపీ ఓట్లు	విజేత ఆధిక్యత	2019 టీడీపీ ఓట్లు	2019 వైసీపీ ఓట్లు	విజేత ఆధిక్యత	2024 టీడీపీ ఓట్లు	2024 వైసీపీ ఓట్లు	విజేత ఆధిక్యత
తంబళ్ళపల్లి	82090	72900	9190టీ	58506	105444	46938వై	84033	94136	10103వై
పీలేరు	33857	71949	38092వై	79426	87300	7874వై	105582	80501	25081టీ
మదనపల్లె	64663(టీడీపీ-బీజేపీ)	81252	16589వై	62418	92066	29648వై	97980	92471	5509టీ
పుంగనూరు	72856	104587	31731వై	63876	107431	43555వై	94968	100793	6095వై
చంద్రగిరి	96406	100924	4518వై	86035	127790	41755వై	143667	99815	43852టీ
తిరుపతి	99313	57774	41539టీ	79836	80544	00708వై	124107(కూటమి)	62151	61956జే
శ్రీకాళహస్తి	89953	82370	7583టీ	71400	109541	38141వై	121565	78261	43304టీ
సత్యవేడు	77655	73428	4227టీ	59197	103941	44744వై	85471	81732	3739టీ
నగరి	73866	74724	858వై	77625	80333	2708వై	107797	62793	45004టీ
జీడీనెల్లూరు	63973	84538	20565వై	57444	102356	44912వై	101176	75165	26011టీ
చిత్తూరు	73430	66631	6799టీ	51238	91206	39968వై	88066	73462	14604టీ
పూతలపట్టు	82298	83200	902వై	74102	103265	29163వై	102137	86503	15634టీ
పలమనేరు	93651	96541	2890వై	87625	119241	31616వై	123232	103110	20122టీ
కుప్పం	102952	55831	47121టీ	100146	69424	30722టీ	121929	73923	48006టీ
మొత్తం	11,06,963	11,06,649	314టీ	10,08,874	13,79,882	3,71,008వై	15,01,710	11,64,846	3,36,864టీ

సాధారణ మెజారిటీలను రెట్టింపు చేసిన స్థానిక పరిస్థితులు

వైసీపీ ప్రభుత్వంపై నెలకొన్న వ్యతిరేకత కారణంగా పలువురు టీడీపీ అభ్యర్థులకు సాధారణ మెజారిటీ రాగా కొన్ని చోట్ల స్థానిక పరిస్థితులు మెజారిటీలను అమాంతం పెంచేశాయి. ఉదాహరణకు తిరుపతి సీటునే తీసుకుంటే స్థానికేతరుడైన ఆరణి శ్రీనివాసులు గెలుపు కష్టమని పలువురు భావించారు. అందునా చిత్తూరులో వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేగా వుండి హఠాత్తుగా తిరుపతిలో జనసేన అభ్యర్థిగా బరిలోకి దిగడంతో తిరుపతిలోని టీడీపీ, జనసేన శ్రేణులు తొలుత సహకరించలేదు. అయితే ఇక్కడ అధికార పార్టీ నేతల తీరు, వ్యవహారశైలి పట్ల జనంలో నెలకొన్న తీవ్ర వ్యతిరేకత కూటమి అభ్యర్థి మెజారిటీలో ప్రతిఫలించింది. శ్రీకాళహస్తిలోనూ ఇదే పరిస్థితి. వైసీపీ అభ్యర్థిపై తీవ్ర స్థాయి అవినీతి ఆరోపణలు ప్రచారంలో వుండడం ప్రజల్లో ఆయన పట్ల వ్యతిరేకతను విపరీతంగా పెంచేసింది. దానివల్లే టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌కు భారీ మెజారిటీ వచ్చిందని పలువురు భావిస్తున్నారు. నగరిలోనూ వైసీపీ అభ్యర్థి రోజా మీద అవినీతి ఆరోపణలకు సొంత పార్టీలో నేతల వ్యతిరేకత తోడు కావడంతో టీడీపీ అభ్యర్థి గాలి భానుకు అనూహ్య మెజారిటీ వచ్చింది. భాను గెలుస్తారని అన్ని వర్గాలూ ముందుగానే నిశ్చితాభిప్రాయానికి వచ్చినా ఈ మెజారిటీని ఎవరూ అంచనా వేయలేదు.చంద్రగిరిలో పదేళ్ళ పాటు ఎమ్మెల్యేగా వున్న చెవిరెడ్డి భాస్కర రెడ్డిపై వ్యతిరేకత ప్రబలింది. సొంత పార్టీలోనూ నాయకులు, కార్యకర్తల్లో అసంతృప్తి ప్రబలింది. కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు విస్తృతంగా ప్రచారమయ్యాయి. అయినా టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ స్వల్ప మెజారిటీతో గట్టెక్కుతారని సొంత పార్టీ వర్గాలే భావించాయి. కానీ అభ్యర్థి కూడా ఊహించని రీతిలో 43 వేలకు పైగా మెజారిటీ రావడం సంచలనం రేపుతోంది.పీలేరులో కూడా నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి గెలుస్తారని అందరూ భావించినా పాతిక వేల మెజారిటీ ఊహించలేదు. చాలా నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు సాధించిన మెజారిటీలు రికార్డు సృష్టించాయంటే అతిశయోక్తి కాదు. మొత్తం మీద అనూహ్య ఆధిక్యతలతో జిల్లావ్యాప్తంగా టీడీపీ శ్రేణులు సంబరపడిపోతున్నాయి.


ముఖేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతిలో సీఈవో

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 6: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా గురువారం సాయంత్రం తిరుపతికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆయనకు స్వాగతం పలికి, పుష్పగుచ్ఛం అందజేశారు. శుక్రవారం ఉదయం కుటుంబ సమేతంగా ముఖేష్‌కుమార్‌మీనా తిరుమల శ్రీవారిని దర్శించుకుని విజయవాడకు తిరుగుప్రయాణం కానున్నారని జిల్లా అధికారులు తెలిపారు.

తుమ్మలగుంట చెరువులో హడావుడి నిర్మాణాలు

- ఎన్జీటీ అభ్యంతరాలున్నా మారని తీరు

తిరుపతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట చెరువులో హడావుడిగా నిర్మాణాలు జరుగుతుండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏవియేషన్ అనుమతులు లేకుండా చెరువులో నెలరోజుల క్రితం భారీ ఎత్తున ఏర్పాటు చేసిన జాతీయ పతాకం కోసం ఐప్యాక్ టీం హెడ్ చేతుల మీదుగా భూమిపూజ చేశారని విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పతాకాన్ని తీసి.. పక్కన పెట్టినట్టు తెలిసింది. అయితే ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పతాక స్తంభం చుట్టూ నిర్మాణాలు జరుగుతున్నాయి. తుమ్మలగుంట చెరువు అన్యాక్రాంతమవుతోందని పలువురు స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు ఎన్జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) సీరియస్ అయిన విషయం తెలిసిందే. ఒకవైపు ఎన్జీటీ అభ్యంతరాలు, మరోవైపు కొత్త ప్రభుత్వం ఏర్పాటు నేపథ్యంలోనూ తుమ్మలగుంట చెరువులో నిర్మాణాలు ఆగకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ముగిసిన ఎన్నికల కోడ్

సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెడతాం: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 6: జిల్లాలో సుమారు మూడు నెలలుగా అమల్లో ఉన్న ఎన్నికల ప్రవర్తనా నియమావళి గురువారంతో ముగిసింది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16న షెడ్యూల్ ప్రకటించడంతో అప్పటి నుంచి ఎన్నికలకోడ్ అమల్లోకి వచ్చింది. తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటం, నామినేషన్లు, పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇవన్నీ విజయవంతంగా నిర్వహించారు. ఎన్నికల కోడ్ ముగియడంతో శుక్రవారం నుంచి ఇక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించనుందని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

చంద్రబాబుకు శ్రీవారి ప్రసాదాలు



చంద్రగిరి, జూన్ 6: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును చంద్రగిరి మండలానికి చెందిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు గురువారం ఉండవల్లిలోని ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎన్నికల కురుక్షేత్రంలో మరెవ్వరికీ సాధ్యం కాని అద్భుత విజయం సాధించి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత సైనికుడి మృతి



మృతిచెందిన మణి (50)

పాకాల, జూన్ 6: పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారి పాకాల మండలం నేంద్రగుంట సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో విశ్రాంత సైనికుడు మృతి చెందారు. చిత్తూరు దొడ్డిపల్లెకు చెందిన విశ్రాంత సైనికుడు ఎన్.మణి (50) తిరుపతి చెర్లోపల్లె సమీపంలోని ఎస్వీ డిఫెన్స్ అకాడమిలో పనిచేస్తున్నారు. అక్కడే ఉంటూ వారానికి ఒకసారి స్వగ్రామానికి వెళ్లి వచ్చేవారు. గురువారం మోటరు సైకిల్‌పై చిత్తూరు వైపు వెళుతూ నేంద్రగుంట ఫ్లైఓవర్‌పై లారీని ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో మణి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద స్థలాన్ని సందర్శించిన పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో తెలుగు మాధ్యమాన్ని ప్రారంభించాలి



ప్లకార్డుతో మహేష్ తదితరులు

తిరుపతి(విద్య), జూన్ 6: రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో కొత్తగా ఏర్పాటు కానున్న ప్రభుత్వం అన్ని సర్కారు బడుల్లో ఇంగ్లీషుతోపాటు తిరిగి తెలుగు మాధ్యమాన్ని ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ దేగల కోరారు. ఈ మేరకు తిరుచానూరు జడ్పీ హైస్కూల్ ఎదుట గురువారం ప్లకార్డు ప్రదర్శించారు. వైసీపీ ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి బలవంతంగా ఆంగ్ల మాధ్యమాన్ని అమలు చేసిందని, దాంతో ఎక్కువ సంఖ్యలోని పేదవిద్యార్థులు చదువులో వెనుకబడ్డారని ఆరోపించారు. సీఎంగా చంద్రబాబు.. తెలుగు మాధ్యమం అమలుపై తొలిసంతకాన్ని పెట్టాలని విన్నవించారు. సంఘ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జయచంద్రారెడ్డి, మురళి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట-కాట్పాడి రైల్వే సెక్షన్‌లో తనిఖీలు



బొమ్మసముద్రం రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న సీఆర్ఎస్ మాధవి

తిరుపతి(ఆటోనగర్), జూన్ 6: రేణిగుంట-కాట్పాడి రైల్వే సెక్షన్‌లో గురువారం దక్షిణ మధ్య రైల్వే చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ మాధవి పలు ప్రాంతాలను తనిఖీ చేశారు. రేణిగుంటలో ఉదయం బయల్దేరి తిరుపతి, పాకాల, చిత్తూరు మీదుగా దక్షిణ మధ్య రైల్వే సరిహద్దులో ఉన్న బొమ్మసముద్రం స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. స్టేషన్ మాస్టర్ కార్యాలయంలో రైళ్ల రాకపోకలు, భద్రత అంశాలను ఆమె తనిఖీ చేశారు. అనంతరం పాకాల రైల్వే యార్డ్‌లోని 62వ ఎల్‌సీ గేటు నిర్వహణ తీరును పరిశీలించి, ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ముంగిలపట్టు-చంద్రగిరి రైల్వే స్టేషన్‌ల మధ్య వున్న వంతెనను తనిఖీ చేసిన అనంతరం తిరుపతి చేరుకున్నారు. శుక్రవారం రేణిగుంట రైల్వే స్టేషన్‌లోని యార్డును పరిశీలిస్తారు. అనంతరం సికింద్రాబాద్ వెళతారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ డివిజన్ అధికారులు సుధాకర్, లక్ష్మీనాయక్, సూర్యనారాయణ, చంద్రశేఖర్, తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, సురేష్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డుపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి : సీపీఐ





గుజరిషాపును ధ్వంసం చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నేతలు - గాయపడ్డ సెక్యూరిటీ గార్డు భరత్

తిరుపతి రూరల్, జూన్ 6: తిరుపతి రూరల్ మండలంలో ఓటేరు సమీపంలోని హైవే వద్ద ఉన్న గుజరి షాపులో పనిచేసే సెక్యూరిటీ గార్డు భరత్‌పై దాడిచేసి తీవ్రంగా గాయపరచిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పేర్కొన్నారు. దాడి జరిగిన స్థలాన్ని గురువారం సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు తక్షణమే దాడిచేసిన వారిని అరెస్టు చేయాలని, లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నాయకులు విశ్వనాథ్, చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, పద్మనాభరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రి సందర్శన



తిరుపతి(వైద్యం), జూన్ 6: స్థానిక ఆర్సీరోడ్డులో ఉన్న కార్మికరాజ్యబీమా ఆస్పత్రిని ఈఎస్ఐ కార్పొరేషన్ సౌత్‌జోన్ ఇన్సూరెన్స్ కమిషనర్ ఎస్.రాజేష్‌కుమార్ గురువారం సందర్శించారు. ఇన్, అవుట్ పేషెంట్స్ విభాగాలు, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, ఫిజియోథెరపి, ఎమర్జెన్సీ విభాగాలను తనిఖీ చేసి రోగులకు అందుతున్న సేవలను గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాల పెంపునకు చర్యలు తీసుకోవాలని, సర్జికల్, ల్యాబ్ ఐటమ్స్‌కు చెందిన కొత్త, ఈఎస్ఐసీ రేట్ కాంట్రాక్టు బుక్స్ వచ్చేలా చూడాలని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీధర్, ఇతర వైద్యులను కోరారు. అవుట్‌పేషెంట్, రిజిస్ట్రేషన్ల సంఖ్యను, శస్త్ర చికిత్సలను మరింత పెంచాలన్నారు. ఈతనిఖీల్లో ఈఎస్ఐసీ సంస్థ ప్రాంతీయ అధికారి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశానికే చంద్రబాబు ఆదర్శం





చంద్రబాబుతో నాని - లోకేశ్‌తో నాని, వినీల్

తిరుచానూరు, జూన్ 6: టీడీపీ అధినేత చంద్రబాబు దేశానికే ఆదర్శంగా నిలిచిన నాయకుడని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కొనియాడారు. తన తనయుడు వినీల్‌తో కలిసి గురువారం ఉండవల్లిలో చంద్రబాబును కలిసి ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రగిరిలో భారీ మెజార్టీతో విజయం సాధించిన నానీని ఈ సందర్భంగా చంద్రబాబు అభినందించారు.చంద్రగిరి అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం మంగళగిరి నుంచి భారీ మెజార్టీతో గెలిచిన లోకేశ్‌ను కలిసిన నానీ, ఆయన తనయుడు వినీల్ దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.తరువాత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను కలిశారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని నానీకి భువనేశ్వరి సూచించారు. భారీమెజార్టీతో విజయం సాధించిన నానీని బాలకృష్ణ అభినందించారు.

నారా లోకేశ్‌కు శుభాకాంక్షలు



తిరుచానూరు, జూన్ 6: మంగళగిరి నుంచి భారీ మెజార్టీతో గెలిచిన టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్‌ను గురువారం ఎడిపై విద్యాసంస్థల డైరెక్టర్ ప్రణీత్ ఉండవల్లిలో కలసి శుభాకాంక్షలు తెలిపారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని కూడా ఆయన కలిశారు. దుశ్శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలుతెలిపారు.

కూటమి విజయంలో కీలక పాత్ర



లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బడి సుధాయాదవ్

తిరుపతి రూరల్, జూన్ 6: మంగళగిరి ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో ఘనవిజయం సాధించిన నారా లోకేశ్‌ను రాష్ట్ర ఓబీసీ ఫోరం కన్వీనర్ బడి సుధాయాదవ్ గురువారం కలసి పుష్పగుచ్ఛంతో అభినందించారు.యువగళం పాదయాత్రతో ప్రజల మనసులను గెలిచి రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడానికి లోకేశ్ కీలకంగా వ్యవహరించారని గుర్తు చేశారు.

ఎన్డీయేలో టీడీపీ భాగస్వామ్యం రాష్ట్రానికి సానుకూల అంశం

గాలి భానుప్రకాష్



తిరుమల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమిలో టీడీపీ భాగస్వామ్యం రాష్ట్రానికి సానుకూల అంశమని నగరి ఎమ్మెల్యేగా గెలిచిన గాలి భానుప్రకాష్ అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచాక తొలిసారిగా గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. ఎన్డీయేలో భాగస్వామ్యం కారణంగా రాష్ట్ర హక్కులు కాపాడుకుని, రావాల్సిన నిధులు తెచ్చుకుంటామని చెప్పారు. ఇక ప్రజలందరూ వన్‌సైడ్ ఉండి రాష్ట్రాన్ని కాపాడుకుందాం అనే సందేశం ఇచ్చారన్నారు. స్వామి దయ, ప్రజల ఆశీస్సులతో మంచి ప్రభుత్వం ఏర్పడనుందని తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని బాబు బాగా అభివృద్ధి చేస్తారనే నమ్మకం ఉందన్నారు.

ఆరణికి అభినందనల వెల్లువ



తిరుపతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి):తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం ఆయన నివాసంలో పెద్దఎత్తున ఎన్డీఏ నాయకులు, ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు ఆయనను కలిసి సత్కరించారు. టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు ఊట్ల సురేంద్ర నాయుడు, ఆర్సీ శ్రీనివాస్, సుబ్బు యాదవ్, ఎస్వీఎం శ్రీధర్, వినోద్ రాయల్, శంకర్ యాదవ్ తదితరులు శ్రీవారి చిత్రపటంతో సత్కరించారు. మనోహర ఆచారి, జ్యోతి, అశోక్, రామారావు, సుబ్బు, రమేష్, రవి తదితరులున్నారు.

టీడీపీ ఎస్టీ సెల్ హర్షం : కూటమి గెలుపుకు తాము కూడా అహర్నిశలు శ్రమించామని టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ కార్యదర్శి మనోహర్‌నాయక్ తెలిపారు.కూటమి ఎమ్మెల్యే, ఎంపీల అభ్యర్థులను గెలిపించే దిశగా పనిచేసామన్నారు.నాలుగో విడత సీఎంగా చంద్రబాబును చేయడంలో తాము కూడా ప్రధాన పాత్ర పోషించామన్నారు.ఈ సమావేశంలో సుబ్బయ్య, రెడ్డినాయక్, రాజారాం,సురేష్, సురేంద్ర, కిషోర్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

కూటమి విజయంపై బీసీ నేతల హర్షం

తిరుపతి అర్బన్, జూన్ 6: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అఖండ విజయం సాధించినందుకు తెలుగుదేశం బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం వారు ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో సంక్రాంతి, ఉగాది, దీపావళి పండుగలు ఒకేసారి వచ్చినట్లు అనిపిస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. విజయానికి కృషి చేసిన బీసీ నేతలకు, నాయకులకు, కార్యకర్తలకు కూటమి ప్రభుత్వంలో సముచితస్థానం కల్పిస్తే ఆమోదంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మదుసూదన్ యాదవ్, జగన్నాధం, సింధూజ, తులసీదాస్,

ఎస్వీయూ ఉద్యోగుల అభినందన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 6: తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును ఎస్వీయూ నాన్ టీచింగ్, టీచింగ్ ఉద్యోగులు కలిసి సత్కరించారు. శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందించి అభినందనలు తెలిపారు. నాన్ టీచింగ్ ఉద్యోగ సంఘ నాయకులు పి.కె. సుబ్రమణ్యం, నెల్లూరు సుబ్రమణ్యం, ఎస్ఎంఆర్ ఉద్యోగ సంఘం నాయకుడు జగదీష్, హేమంత్, లీలాకృష్ణ, మునిప్రసాద్, జియాలజీ విభాగ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ ఉమ్మరొశెట్టి డీబీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరణికి మంత్రివర్గంలో చోటు దక్కాలి

తిరుపతి, జూన్6(ఆంధ్రజ్యోతి):గడిచిన ఐదేళ్లుగా ఉద్యోగ, పెన్షనర్లకు తీవ్ర అన్యాయం చేసిన వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ పూర్వ నాయకుడు, జనసేన నేత ఎం.నరసింహులు నాయుడు అన్నారు. దేశచరిత్రలోనే నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టిన కొత్త ప్రభుత్వానికి, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఉద్యోగ. పెన్షనర్ల జేఏసీ నాయకులు యూనియన్ కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా నరసింహ నాయుడు మాట్లాడుతూ ఆరణి శ్రీనివాసులుకు మంత్రివర్గంలో చోటు కల్పిస్తే, జిల్లా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని అభిలషించారు.

17 నుంచి పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు

తిరుచానూరు, జూన్ 6: తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు ఈ నెల 17నుంచి ఐదురోజులపాటు ఘనంగా జరగనున్నాయి. ప్రతిరోజు సాయంత్రం 6.30నుంచి రాత్రి 7.30గంటల వరకు అమ్మవారి పద్మసరోవరంలో తెప్పలపై విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి జేష్ఠ శుద్ధ ఏకాదశి నుంచి పౌర్ణమి వరకు రమణీయంగా తెప్పోత్సవాలు నిర్వహిస్తారు. 17వ తేదీన రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి, 18న సుందరరాజస్వామి, 19, 20, 21న పద్మావతి అమ్మవారు తెప్పలపై విహరిస్తారు. చివరి మూడు రోజుల పాటు పద్మసరోవరంలోని నీరాడ మండపంలో మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 4.30గంటల వరకు అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. 20వ తేదీ రాత్రి 8.30గంటలకు అమ్మవారికి గజవాహనం, 21న రాత్రి 8.30గంటలకు గరుడ వాహనసేవ నిర్వహిస్తారు. తెప్పోత్సవాల కారణంగా ఆలయంలో ఐదు రోజుల పాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, జూన్ 21న లక్ష్మీపూజను రద్దు చేశారు.

పద్మావతి జూనియర్ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం



విద్యార్థినికి ప్రవేశ పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్

తిరుపతి(విద్య), జూన్ 6: టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి విడత ప్రవేశాల ప్రక్రియ 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సి.భువనేశ్వరి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సెల్‌ఫోన్ ద్వారా సందేశాలు అందజేశామని, ఆన్‌లైన్‌లో సెలక్షన్ జాబితా అందుబాటులో ఉంచామని చెప్పారు. అలాగే పలువురు విద్యార్థినులకు ప్రవేశ పత్రాలను అందజేసినట్టు వెల్లడించారు. అధ్యాపకులు, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

16న సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 6: సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష ఈనెల 16వ తేదీన జరగనుందని డీఆర్వో పెంచలకిషోర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో పరీక్ష నిర్వహణపై యూపీఎస్సీ అధికారులు నిర్వహించిన గూగుల్ మీట్‌కు డీఆర్వో హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 11 సెంటర్లు కేటాయించినట్లు తెలిపారు. 5,518మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. 11మంది తహసీల్దార్లను లైజన్ అధికారులుగా నియమించినట్లు వివరించారు.

శ్రీవారి ఆలయం మీదుగా విమానం



ఆలయంపై వెళుతున్న విమానం

తిరుమల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం మీదుగా మరోసారి విమానం ప్రయాణించడం విమర్శలకు దారితీసింది. శ్రీవేంకటేశ్వర స్వామి కొలువైన ఆలయంపై విమానాలు ప్రయాణించడం ఆగమశాస్త్ర విరుద్ధం. ఈ అంశంపై ఇప్పటికే అర్చకులు పలుమార్లు చెప్పినప్పటికీ తిరుమల క్షేత్రం మీదుగా తరచూ విమానాలు ప్రయాణిస్తూనే ఉన్నాయి. గురువారం ఉదయం 8.15 గంటలకు ఓ విమానం క్షేత్రం మీదుగా ప్రయాణించింది. భక్తుల మనోభావాలు దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా అధికారులు విమానాలు ప్రయాణించకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు. కేంద్రంతో మరోసారి ఈ అంశంపై చర్చించి విమానాలు తిరుమల క్షేత్రంపై రాకపోకలు సాగించకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దండాయుధపాణికి మొక్కుల చెల్లింపు

తిరుచానూరు, జూన్ 6: చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నానీ విజయం సాధించడంతో తిరుచానూరు టీడీపీ నేతలు తనపల్లి గుట్టపై వెలసి ఉన్న దండాయుధపాణి స్వామి ఆలయం వద్ద గురువారం 1,001 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో యోగిమల్లవరానికి చెందిన టీడీపీ నాయకులు సాల్మన్‌రాజు, సుధాకర్‌తో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.





గాయపడ్డ విజయసేనారెడ్డి, రాకేష్ రెడ్డి

టీడీపీ,వైసీపీ పరస్పర దాడులు

చిల్లకూరులో 10మందికి గాయాలు

పెళ్లకూరు, జూన్ 6 : టీడీపీ,వైసీపీ వర్గీయుల పరస్పర దాడుల్లో 10మంది గాయపడ్డారు.ఎన్నికల్లో టీడీపీ గెలిచిన నేపథ్యంలో చిల్లకూరులో గురువారం రాత్రి టీడీపీ వర్గీయులు సంబరాలు జరుపుకున్నారు.ఇటీవల టీడీపీలో చేరిన తండ్రీకొడుకులైన విజయసేనారెడ్డి, రాకేష్ రెడ్డి వర్గీయులు తమ ఇంటి ముందు టపాసులు కాలుస్తుండగా వైసీపీ సీనియర్ నేత కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి వర్గీయులు అడ్డుచెప్పడంతో గొడవ ప్రారంభమైంది. ఇరు వర్గాలూ రాళ్ల దాడి చేసుకోగా సుమారు పదిమందికి పైగా గాయపడ్డారు.డీఎస్పీ శ్రీనివాస రెడ్డి బలగాలతో చిల్లకూరు చేరుకుని గాయపడ్డవారిని నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని గ్రామంలో పికెట్ ఏర్పాటు చేశారు.

దివ్యాంగ విద్యార్థులను భవిత కేంద్రాల్లో చేర్పించండి



అంగన్వాడీ కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులు, సిబ్బందితో చంద్రశేఖర్‌రెడ్డి

తిరుపతి(విద్య), జూన్ 6: ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను సాధారణ పిల్లల మాదిరిగానే పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి పెద్దలకు సూచించారు. దివ్యాంగ విద్యార్థులను భవిత కేంద్రాల్లో చేర్పించేందుకుగాను గురువారం ఆయన స్థానిక పద్మావతినగర్, తిరుమలనగర్ తదితర ప్రాంతాల్లో సర్వే నిర్వహించి, దివ్యాంగ విద్యార్థులను గుర్తించారు. ఆయన మాట్లాడుతూ... దివ్యాంగ విద్యార్థులకోసం ప్రత్యేకంగా భవిత కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భవిత కేంద్రాల్లో ప్రత్యేకంగా సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉంటారని, విద్యార్థులకు ఉచిత శిక్షణ, ఉపకరణాల ఏర్పాటు ఉంటుందని వివరించారు. భవిత సెంటర్ ఉపాధ్యాయులు కృష్ణమ్మ, భవానీ, అంగన్వాడీ ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో ఎస్పీ పర్యటన



ఎ.రంగంపేటలో పోలీసు అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ

చంద్రగిరి, జూన్ 6: చంద్రగిరి మండల పరిధిలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు గురువారం విస్తృతంగా పర్యటించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా గురువారం మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన కొటాల, కూచువారిపల్లె, ఎ.రంగంపేట, శేషాపురం, కందులవారిపల్లె, చిన్నరామాపురం, భీమవరం గ్రామాల్లో ఎస్పీ పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఉన్న పోలీస్ పికెట్లను తనిఖీ చేస్తూ విధి నిర్వహణలో ఉన్న పోలీస్ సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. గ్రామాల్లో ఏదైనా అనుమానంగా అనిపిస్తే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేసి, అప్రమత్తంగా ఉండాలన్నారు. అదనపు ఎస్పీ కులశేఖర్, వీఆర్ డీఎస్పీ రవీంద్రరెడ్డి, చంద్రగిరి సీఐ రామయ్య, ఎస్ఐ అనిత, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులకు పరామర్శ



వైసీపీ నాయకుడు మస్తాన్ తదితరులతో చెవిరెడ్డి

చంద్రగిరి, జూన్ 6: చంద్రగిరిలో వైసీపీ కార్యకర్తలను మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి గురువారం సాయంత్రం పరామర్శించారు. బుధవారం రాత్రి తనపై దాడి చేయడానికి ప్రయత్నించారంటూ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మస్తాన్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేశారు. ఐతేపల్లె డాబా వద్ద వైసీపీ వార్డు సభ్యుడు సక్కూరి వంశీపై దాడికి సంబంధించి కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో చెవిరెడ్డి వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. పార్టీ నాయకులకు అండగా ఉంటానన్నారు.

ఆర్‌సీపురంలో భారీ వర్షం



రామచంద్రాపురం, జూన్ 6: ఆర్‌సీపురం మండలంలో బుధవారం రాత్రి నుంచి పలుదఫాలుగా వర్షం కురుస్తోంది. గురువారం మధ్యాహ్నం 2గంటల నుంచి 4 గంటల వరకు భారీ వర్షం కురిసింది. ఈవర్షం కారణంగా పొలాల్లో అడుగు మేర నీరు నిలిచింది. కేకేవీపురం, గంగిరెడ్డిపల్లి వద్ద ఇటుకలు తడిసి ముద్దయ్యాయి. మూడునెలలుగా ఉక్కపోతతో అల్లాడుతున్న జనం వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు.

ఎర్రావారిపాలెంలో....



పొలాల్లో ప్రవహిస్తున్న వర్షపు నీరు

ఎర్రావారిపాలెం, జూన్ 6: రాయలసీమలో రుతు పవనాలు చురుకుగా కదులుతుండటంతో మండలంలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. గత రెండు రోజులుగా తేలిక పాటి వర్షాలు కురిశాయి. గురువారం సాయంత్రం గంటన్నర పాటు కుంభవృష్టి వర్షం కురిసింది. ఈ వర్షాలతో మెట్ట పొలాల్లో వేరుశనగ సాగుకు రైతులు సిద్ధమయ్యారు. టమోటా, మామిడి పంటకు కొంత మేర నష్టం వాటిల్లింది. మామిడి పంట కోత తుది దశలో ఉంది. మంచి ధర పలుకుతుండటంతో రైతులు, వ్యాపారస్తులు కొంత సమయం ఆగి పంట కోస్తుండటంతో నష్టం వాటిల్లుతోంది. వర్షపు నీరు పొలాల్లోకి చేరి అక్కడ నుంచి చెరువుల్లోకి చేరుతోంది.



మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

రామచంద్రాపురం, జూన్ 6: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి మొక్కలే శరణ్యమని అంకురం స్వచ్ఛంద సంస్థ చైర్మన్ జయరామయ్య అన్నారు. కుప్పం బాదూరు, రామాపురం ఎస్టీకాలనీల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మొక్కలు నాటారు. జయరామయ్య మాట్లాడుతూ అంతరించిపోతున్న అడవులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సిబ్బంది నాగరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మహేశ్వరి, లాల్లెమ్మ పాల్గొన్నారు.



మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులు

పాకాల, జూన్ 6: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి భారీ విజయం సాధించడం, చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నాని అత్యధిక మెజారిటీతో గెలుపొందడంతో పాకాల మండల టీడీపీ నాయకులు గురువారం నెల్లూరు జిల్లా పెనుశిల లక్ష్మీనరసింహస్వామిని దర్శించి, తలనీలాలు సమర్పించారు.వీరిలో వి.వి.రమణ, సుబ్రహ్మణ్యం, కాళప్ప వున్నారు. తెలుగు యువత నాయకులు ప్రతాప్ చౌదరి, వినోద్, సురేష్, జ్యోతీరావ్ నేంద్రగుంట నుంచి అర్ధగిరి ఆంజనేయస్వామి ఆలయం వరకు పాదయాత్రగా వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ నాయకులు సురేష్ చౌదరి, తులసి, వాసు, నాగూర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే వైపు వైసీపీ కార్పొరేటర్ల చూపు

ఫలితాలు వచ్చిన రెండ్రోజుల్లోనే పది మంది మంతనాలు

నెలరోజుల్లోనే అవిశ్వాస తీర్మానానికి అవకాశం

తిరుపతి, ఆంధ్రజ్యోతి: కొత్త ప్రభుత్వం కొలువుదీరకముందే తిరుపతి నగరపాలక సంస్థలో అవిశ్వాస ప్రచారం జోరందుకుంది. సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాభవం చెందిన వైసీపీ స్థానిక నాయకత్వానికి కౌన్సిల్‌ను కాపాడుకోవడం పెద్ద సవాల్‌గా మారుతోంది. ఎన్డీయే ప్రభంజనంతో సొంత పార్టీ కార్పొరేటర్లు కూటమి నేతలతో ఇప్పటికే మంతనాలు మొదలుపెట్టినట్టు తెలుస్తోంది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లో 50 డివిజన్లు ఉంటే వివాదాల కారణంగా కోర్టు ఉత్తర్వులతో ఒక్క డివిజన్‌కు పోలింగ్ జరగలేదు. మూడేళ్ల క్రితం జరిగిన పురపాలక ఎన్నికల్లో 49 డివిజన్లకు కార్పొరేటర్లు ఎంపికయ్యారు. వీరిలో టీడీపీ నుంచి ఆర్సీ మునికృష్ణ మాత్రమే గెలవగా తక్కిన 48 డివిజన్లను వైసీపీ ఖాతాలో వేసుకుంది. ఎన్నికల తంతు ఎలా జరిగిందన్న విషయాన్ని పక్కనపెడితే విపక్షానికి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా కౌన్సిల్ ఏర్పాటైంది. ఇక ఆరు నెలల క్రితం వైసీపీ కార్పొరేటర్ హనుమంత్ నాయక్ అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వైసీపీ కార్పొరేటర్ల సంఖ్య 47కు తగ్గింది. సార్వత్రిక ఎన్నికల ముందు అన్నా సిస్టర్స్ సంధ్య, అనిత, మరో ఇద్దరు మహిళా కార్పొరేటర్లు కల్పన యాదవ్, రేవతిలు వైసీపీకి రాజీనామా చేసి ఎన్డీయేలో చేరారు. దీంతో వైసీపీ కార్పొరేటర్ల సంఖ్య 43కు పడిపోగా ఒకే ఒక్కడుగా ఉన్న ఎన్డీయే సంఖ్య ఎన్నికల ముందే ఐదుకు చేరింది. కాగా ఫలితాల వెలువడిన రోజే ఐదుగురు కార్పొరేటర్లు ఎన్డీయే అభ్యర్థి అరణి శ్రీనివాసులు విజయానికి తెరవెనుకవుండి కీలకంగా పనిచేసిన ఓ నాయకుడిని కలిసినట్టు తెలిసింది. వారి తరఫున బుధవారం మరో ఐదుగురు వైసీపీ కార్పొరేటర్లు ఆయనతో మంతనాలు జరిపినట్టు సమాచారం. కొత్త ప్రభుత్వం కొలువుదీరేలోపు ఇరవైమంది వరకు ఎన్డీయేవైపు వచ్చేందుకు మొగ్గు చూపుతున్నారన్న ప్రచారం జరుగుతోంది.

మేయర్ పీఠం కోసం..

మేయర్ పీఠం కోసం అప్పుడే పలువురు రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. అన్నా సిస్టర్స్ పేరు తెరమీదకు వచ్చింది. అయితే ప్రస్తుత మేయర్ డాక్టర్ శిరీష ఎన్డీయే కూటమిలోకి వస్తే మాత్రం ఆమెనే మేయర్‌గా కొనసాగించేందుకు మెజారిటీ కార్పొరేటర్లు ఆసక్తి చూపుతున్నారనీ చెబుతున్నారు. ఆదిశగా కూడా ప్రయత్నాలు కూడా జరుగుతున్నట్టు సమాచారం. ఇక రెండు డిప్యూటీ మేయర్ పదవులను ఎన్డీయే కూటమిలో కొత్తగా చేరబోయే కార్పొరేటర్‌తోపాటు మూడేళ్లుగా అధికారపక్షంపై పోరాడిన ఏకైక కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణకు దక్కే అవకాశాలు న్యాయనీ చెప్పుకుంటున్నారు. ఏదిఏమైనా నెలరోజుల్లోనే సభ్యులు అవిశ్వాస తీర్మానం కోరే పరిస్థితి ఉందన్న చర్చ జోరుగా జరుగుతోంది.

ప్రముఖ రచయిత రామమూర్తి కన్నుమూత



తిరుపతి (కల్చరల్), జూన్ 6: తిరుపతికి చెందిన ప్రముఖ రచయిత, భావుక బ్రహ్మ బిరుదాంకితుడు డాక్టర్ కలువగుంట రామమూర్తి(74) బుధవారం రాత్రి తన నివాసంలో గుండెపోటుతో మృతిచెందారు. టీటీడీ సప్తగిరి మాసపత్రికలో ఉపసంపాదకుడిగా పని చేసిన ఈయన గతంలో విద్వాన్ విశ్వం వద్ద సహాయకుడిగా పనిచేశారు. అగ్నిగర్భ, శిలాయజ్ఞం, ఆరణ్యకం అనే నవలలు, కనులముందు నీవుంటే పేరుతో వచన కవిత్వం ప్రచురించారు. కొంతకాలంగా వేటూరి ప్రభాకర శాస్త్రి వాఙ్మయ పీఠం సంచాలకుడిగా పనిచేస్తున్నారు. సాహితీ ప్రముఖులు శైలకుమార్, రాసాని, భూమన్, తిరసం అధ్యక్షుడు సాకం నాగరాజు, ఆముదాల మురళి, పేరూరు బాలసుబ్రహ్మణ్యం, అరసం తిరుపతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, కృష్ణస్వామి రాజు తదితరులు రామమూర్తి మృతి పట్ల సంతాపం ప్రకటించారు. రామమూర్తి అంతిమ సంస్కారాలు శుక్రవారం ఉదయం 11 గంటలకు గోవిందధామంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నేడు వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం

తిరుపతి రూరల్, జూన్ 6: తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాల 63వ వార్షికోత్సవం శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు జరగనుంది. కళాశాల వేదికగా జరిగే ఈ వార్షికోత్సం నిర్వహిస్తున్నట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా ఎన్జీ రంగా వ్యవసాయవర్సిటీ వీసీ డాక్టర్ ఆర్.శారదాజయలక్ష్మీతోపాటు అగ్రి డీన్ డాక్టర్ జి.కరుణాసాగర్, కర్ణాటక రాష్ట్రం తుముకూరు జిల్లా ఎస్పీ కేవీ అశోక్ తదితరులు హాజరుకానున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.03 కోట్లు

తిరుమల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.03 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. కాగా, బుధవారం 67,320 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 27,919 మంది తలనీలాలు సమర్పించారు. అలాగే స్వామివారిని గురువారం టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు దర్శించుకున్నారు.

తిరుపతిలో వైసీపీ కార్యాలయం ధ్వంసం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 6: ఎస్కే ఫాస్ట్‌ఫుడ్ వద్ద ఉన్న వైసీపీ కార్యాలయాన్ని కొందరు ధ్వంసం చేశారు. ఎనిమిదో డివిజన్ పరిధిలోని కార్యాలయాన్ని మురళి నిర్వహిస్తున్నాడు. షట్టర్ ఓపెన్ చేసి, గ్లాస్ డోర్‌కు తాళం వేసుకుని వెళ్లిన సమయంలో కొందరు రాళ్లతో దాడి చేసి.. లోపలికి వెళ్లి ఫర్నిచర్ ధ్వంసం చేశారు. టీవీలు, కంప్యూటర్లు, టేబుళ్లు ధ్వంసమైనట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనా స్థలికి చేరుకుని కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు సీఐ మహేశ్వర రెడ్డి చెప్పారు.

మహిళా వర్సిటీకి రూ.8.78 లక్షల మంజూరు



నిధుల మంజూరు పత్రాలతో వీసీ భారతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 6: పద్మావతి మహిళా యూనివర్సిటీకి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నుంచి రూ. 6 లక్షల 78 వేల నిధులు మంజూరయ్యాయి.జీవ వైవిధ్య రంగంలో బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో చేపట్టే కార్యక్రమాలకు ఈ నిధులను వెచ్చించనున్నట్టు వీసీ భారతి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

టెన్జింగ్ నార్గే సాహస పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, జూన్ 6: టెన్జింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈవో మురళీకృష్ణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2021, 2022, 2023సంవత్సరాల్లో భూమి, నీరు, గాలిలో సాహస కృత్యం చేసినవారు, జీవిత కాలంలో ఏదేని సాహస కృత్యంలో ప్రతిభచాటిన వివరాలతో హెచ్‌టీటీపీఎస్://అవార్డ్స్.జీవోవీ.ఇన్ పోర్టల్లో నమోదుచేసుకోవాలి. ఈనెల 14లోపు దరఖాస్తు చేసుకున్నవారికే సాహస పురస్కారానికి అర్హులని తెలిపారు.

కష్టపడేవారికే పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలి

తిరుపతి అర్బన్, జూన్ 6: కష్టపడేవారికే పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని అధిష్ఠానాన్ని కాంగ్రెస్ నాయకురాలు సునీల కోరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జోడో యాత్రతో ఉత్తరాదిన కాంగ్రెస్ పుంజుకుందన్నారు. దక్షిణాదిలో చతికిల పడడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి నేతలకు అభినందనలు తెలియజేశారు. సుభాషిణి, మంగశ్రీ, దీపు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆధార్ సీడింగ్ చేయించుకోవాలి

తిరుపతి(విద్య), జూన్ 6: నేషనల్ స్కాలర్‌షిప్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పొందేందుకు విద్యార్థులు తమ బ్యాంకు అకౌంటుకు ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వి.శేఖర్ సూచించారు. ఈ సంవత్సరం 9, 10, 11, 12 తరగతులు చదువుతూ స్కాలర్‌షిప్‌కోసం పోర్టల్లో నమోదు చేసుకుని ఇంకా నగదు జమకాని వారి సెల్‌ఫోన్లకు ఇందుకు సంబంధించిన సందేశాలను పంపించారని చెప్పారు. సందేశాలు అందిన విద్యార్థులు తమ లాగిన్‌లోని స్టేటస్ ప్రింట్ తీసుకుని సంబంధిత బ్యాంకుకు వెళ్లి ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని సూచించారు. ప్రక్రియ పూర్తిచేసిన వారికి న్యూఢిల్లీలోని కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ నేరుగా విద్యార్థి బ్యాంకు ఖాతాకు నగదు జమ చేస్తుందని వెల్లడించారు. తల్లిదండ్రులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఊహించని తిరుపతి మెజారిటీ

ఆరణి ఆధిక్యతా, అభినయ్‌కి వచ్చిన ఓట్లూ ఒక్కటే

జిల్లాలో మెగా మెజారిటీ తిరుపతిదే

ఫలించని భూమన వ్యూహాలపై జనంలో చర్చ



సునామీలా వైసీపీని ఊడ్చేసిన సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతి అసెంబ్లీ ఫలితం మీద జోరుగా చర్చ జరుగుతోంది. సొంత కూటమిలోనే అభ్యంతరాలతో ఎన్నికల ముందు తెరమీదకు వచ్చిన ఆరణి శ్రీనివాసులుకు లభించిన ఆధిక్యత అందరినీ దిగ్భ్రాంతి పరుస్తోంది. తాను అప్‌డేటెడ్ సాఫ్ట్‌వేర్‌గా చెప్పుకునే వైసీపీ అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డికి ఇంత ఘోర పరాజయం ఏమిటన్న అంశం జనంలో తీవ్ర చర్చగా మారింది. ఎన్నికల్లో ఆరణికి 1,24,107 ఓట్లు రాగా (ఇందులో 1,21,205 ఓట్లు ఈవీఎంల నుంచి, 2902 పోస్టల్ బ్యాలెట్‌ల నుంచి వచ్చాయి.) అభినయ్ రెడ్డికి 62,151 ఓట్లు లభించాయి (ఈవీఎంల ద్వారా 60,950, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1,201). అంటే అభినయ్‌కి వచ్చిన ఓట్లు ఆరణి మెజారిటీతో సమానమయ్యాయంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటివరకు తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో (సుగుణమ్మ గెలిచిన ఉప ఎన్నిక మినహా)జరిగిన సార్వత్రిక ఎన్నికలన్నింటిలోనూ ఈసారి వచ్చిన మెజారిటీ అత్యధికం కావడం విశేషం.

– తిరుపతి, ఆంధ్రజ్యోతి

అభివృద్ధినే అజెండాగా ప్రచారం చేసుకుంది భూమన కుటుంబం. మాస్టర్‌ప్లాన్ రోడ్లు, ఫ్రీ లెఫ్ట్‌లను పదే పదే చెప్పేవారు. విచిత్రం ఏమిటంటే.. 18 మాస్టర్ ప్లాన్ రోడ్లు, నాలుగైదు ఫ్రీలెఫ్ట్‌లు వేసిన చోట కూడా అభినయ్ రెడ్డికి మెజారిటీ రాకపోవడం. మాస్టర్‌ప్లాన్ రోడ్లు, ఫ్రీలెఫ్ట్‌లు ఉన్న కొన్ని డివిజన్లలో అభినయ్ ఖాతాలోకి వచ్చిన ఓట్లను పరిశీలిస్తే.. 33వ వార్డు అశోక్‌నగర్- అబ్బన్నకాలనీలో ఒక బూత్‌లో 128 ఓట్లు అభినయ్‌కి రాగా, ఆరణికి 300 ఓట్లు వచ్చాయి. 8వ డివిజన్లోని మరో బూత్‌లో 125 ఓట్లు వైసీపీకి, 331 ఓట్లు జనసేనకు చేరాయి. 25వ డివిజన్లోని 67వ బూత్‌లో వైసీపీ తుడిచిపెట్టుకు పోయింది. అభినయ్‌కు కేవలం 108 ఓట్లు వస్తే ఆరణికి 505 ఓట్లు వచ్చాయి. 28వ డివిజన్లోని 64వ బూత్‌లో 94 ఓట్లకే అభినయ్‌ను పరిమితం చేయగా 493 ఆరణి ఖాతాలో పడ్డాయి.

ఏ డివిజన్లోనూ కనిపించని ఆధిక్యత

అభినయ్ రెడ్డి డిప్యూటీ మేయర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న 4వ డివిజన్‌లోనూ, మేయర్ డాక్టర్ శిరీష ప్రాతినిధ్యం వహిస్తున్న 27వ డివిజన్‌లోనూ వైసీపీకి చుక్కెదురుకావడం ఆ పార్టీ శ్రేణులకు జీర్ణించుకోలేని అంశంగా మారింది. తిరుపతిలో 50 డివిజన్లు ఉంటే అందులో ఎన్నికల ముందువరకు 43మంది వైసీపీ కార్పొరేటర్లు (రాజీనామా చేసిన కార్పొరేటర్లు కాకుండా), ఐదుగురు కోఆప్షన్ సభ్యులు ఉన్నారు. వీరంతా నిత్యం ప్రజలతో ఏదోరకమైన సంబంధాలను మూడేళ్లపాటు కొనసాగించినవారే. వీరితోపాటు టౌన్ బ్యాంకు పాలక మండలి, వివిధ ఆలయాల ధర్మకర్తల మండళ్లు కూడా వైసీపీవైపు ఉన్నప్పటికీ ఓట్లు రాబట్టలేకపోయారు. వివిధ సంఘాలు, సంస్థలతో నిర్వహించిన 200 ఆత్మీయ సమావేశాలు కూడా ఓట్లను రాల్చలేకపోవడం విశేషం.

సంప్రదాయ ఓటు బ్యాంకుకి గండి

పార్టీకి సంప్రదాయ ఓటు బ్యాంకులుగా ఉన్న ఎంఆర్‌పల్లె, అక్కారంపల్లె, చెన్నారెడ్డి కాలనీ వంటి చోట్ల కూడా నిరాశపరిచే ఫలితాలే వైసీపీకి దక్కాయి. 2014 సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఎంఆర్‌పల్లెలో 512 ఓట్లు, అక్కారంపల్లెలో 308, చెన్నారెడ్డి కాలనీలో 157 ఓట్లు వైసీపీ ఖాతాలో పడ్డాయి. అప్పుడు కరుణాకర రెడ్డిపై టీడీపీ నుంచి పోటీచేసిన వెంకటరమణ 41,539 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అంత మెజారిటీలో కూడా వైసీపీ అక్కడ ఆధిక్యతను ప్రదర్శించింది. 2019లో వైసీపీ ప్రభంజనంలోనూ ఇక్కడ రెండు రెట్ల మెజారిటీని సాధించడం టీడీపీ పరాజయానికి కారణమైంది.

అంచనాలు తారుమారు

గెలుపు అంచనాలపై భూమన కుటుంబంతోపాటు వారి అనుచరులు పెట్టుకున్న ఆశలు, ఎత్తులు పటాపంచలయ్యాయి. 2019లో వైసీపీకి 80వేల పైచిలుకు ఓట్లు పడ్డాయి. ఈ 80వేల ఓట్లు పదిలం అని వైసీపీ నమ్మకంతో ఉంది. తిరుపతిలో రెండు లక్షలమందికి సంక్షేమ పథకాలు అందించామనీ వీరినుంచి గణనీయ సంఖ్యలో తమకు ఓట్లు పడతాయని భూమన కరుణాకరరెడ్డి బహిరంగ సభల్లో చెప్పేవారు. అయితే వైసీపీ సంప్రదాయ ఓటు బ్యాంకుకే కన్నం పడింది. 60వేలకే అభినయ్ రెడ్డి పరిమితం అయ్యారు. ఆరణిని నాన్ లోకల్ అని చేసిన ప్రచారం పారలేదు. భూమన టీటీడీ ఛైర్మన్‌గా.. దేవస్థానం ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇప్పించడం, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి జీతాలు పెంచడం, టీటీడీ నిధులతో మరికొన్ని మాస్టర్ ప్లాన్ రోడ్లకు పచ్చ జెండా ఊపడం వంటివి తమకు అనుకూలిస్తాయన్న ధీమా ఎన్నికల ఫలితాల్లో తేలిపోయింది.

ఆలూరు శ్రీనివాసులుకు 938 ఓట్లా?

జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా ఆలూరు శ్రీనివాసులు పోటీ చేశారు. జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పేరు కిందే ఆలూరు శ్రీనివాసులు పేరు ఉంది. గాజు గ్లాసును పోలిన గుర్తు మాదిరిగా ఆలూరుకు ఫ్లవర్ వాజ్ కేటాయించారు. ఇన్ని సారూప్యతలు ఉండడం వల్లనే అతనికి ఒక్క రోజు కూడా ప్రచారం చేయకుండానే 938 ఓట్లు వచ్చాయి. అంటే ఆరణి శ్రీనివాసులు ఖాతాలో పడాల్సిన ఓట్లు పొరబాటున ఆలూరుకు పడ్డాయన్న చర్చ జరుగుతోంది. జనసేన ఓట్లకు గండికొట్టాలన్న కుట్రతో కడప జిల్లాకు చెందిన ఆలూరు శ్రీనివాసులును ఏరికోరి తీసుకొచ్చారన్న జరిగిన ప్రచారం నిజమని అంటున్నారు. ఇక ఇండియా కూటమి నుంచి సీపీఐ అభ్యర్థిగా బరిలో దిగిన మురళికి వచ్చిన ఓట్లు 608 మాత్రమే కావడం గమనార్హం. నగరంలో ఉద్యమాలతో నిరంతరం జనంలో ఉండే అభ్యర్థికన్నా ఎక్కువగా ఆలూరు శ్రీనివాసులుకు ఓట్లు పడ్డాయి. అయినా అభినయ్‌రెడ్డి విజయానికి ఇవేవీ దోహదపడలేదు.

తిరుపతి ప్రజలకు రుణపడి ఉంటా

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


తిరుమలలో ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి చరిత్రలో తిరుగులేని మెజారిటీని అందించిన ప్రజలకు రుణపడి ఉంటా. ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని నిత్యం అందుబాటులో ఉండి, అభివృద్ధికి కృషి చేస్తా' అని జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్పష్టం చేశారు. తిరుపతి ఎమ్మెల్యేగా భారీ మెజారిటీ అందించిన అన్ని విభాగాల ఉద్యోగులు, సిబ్బంది, నగర ప్రజలు, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. గురువారం తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వచ్చిన ప్రభంజనం పవన్, చంద్రబాబు, మోదీలకు దక్కుతుందన్నారు. పవన్ సునామీకి ఫ్యాన్ రెక్కలు అడ్రస్ లేకుండా కొట్టుకుపోయాయన్నారు. పవన్ ప్రతినిధిగా తాను తిరుపతిలో పోటీ చేయడం జరిగిందని, ఇక్కడి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. కూటమి అధినేతల సహకారంతో తిరుపతి అభివృద్ధిపై ప్రణాళికలు వేస్తామన్నారు. మంత్రివర్గంలో తనకు స్థానం కల్పించాలని అడగలేదని, కలియుగ భగవానుడి ఆశీస్సులు, పవన్ దయతో రావచ్చని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

తిరుమల, తిరుపతి పవిత్రతను కాపాడతా

తిరుమల, ఆంధ్రజ్యోతి: తిరుమల, తిరుపతి పవిత్రతను కాపాడతానని ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచాక గురువారం తొలిసారిగా తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. శ్రీవారు, పవన్, చంద్రబాబు ఆశీస్సులతో తిరుపతి నగర ప్రజలకు ఎమ్మెల్యేగా సేవ చేసే భాగ్యం కలిగిందని, వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. తన విజయాన్ని తిరుపతి ప్రజలకు అంకితం చేస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా తిరుమల జనసేన నాయకులు ఆరణి శ్రీనివాసులను పట్టువస్త్రంతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు.


టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ని గురువారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిసిన తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్‌గౌడ్

వైసీపీకి కొమ్ముకాసిన వారిని వదలం

తెలుగు యువత


ఫొటోలను చూపుతున్న రవినాయుడు తదితరులు

తిరుపతి అర్బన్, జూన్ 6: వైసీపీకి కొమ్ముకాసిన అధికారులను, పోలీసులను వదిలే ప్రసక్తే లేదని తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అరాచకవాది, ఉన్మాది, నియంతను గద్దెదించి పాతాళానికి తొక్కేసిన ప్రజలకు ధన్యవాదాలన్నారు. ప్రజలు ఉమ్మేసినా జగన్‌రెడ్డి మాత్రం నటనలో నాణ్యత చూపుతున్నారని మండిపడ్డారు. బాబాయ్‌ని హత్యచేసిన వారిని కాపాడుతున్నది జగన్ కాదా అని ప్రశ్నించారు. ఇక లోకేశ్ పాదయాత్రను అడ్డుకున్నారని, చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. సజ్జల, విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి ఇంట్లో వేలకోట్ల రూపాయల అవినీతి డబ్బులున్నాయని ఆరోపించారు. శ్రీవారిని అడ్డం పెట్టుకొని వైసీపీ నేతలు కోట్లు సంపాదించారని, రోజా టిక్కెట్ల వ్యవహారంపై విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. టీటీడీ ఈవోగా ధర్మారెడ్డి, చైర్మన్‌గా భూమన కరుణాకరరెడ్డి చేసిన అక్రమాలను వెలుగులోకి తెస్తామన్నారు. తిరుమల పవిత్రతను కాపాడతామని, మెగా డీఎస్సీపైనే చంద్రబాబు మొదటి సంతకం పెడతారని, త్వరలోనే నూతన పరిశ్రమలు తీసుకొస్తారని, యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంత వాతావరణం నెలకొనేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. అవినీతికి పాల్పడకుండా అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందని చెప్పారు.

బాబు సీఎం అవుతున్నారని..

శ్రీవారికి 501 కొబ్బరికాయలు సమర్పించిన టీడీపీ కార్యకర్తలు



తిరుమల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు మళ్లీ సీఎం అవుతున్నారనే సంతోషంతో తిరుమల టీడీపీ కార్యకర్తలు గురువారం తిరుమలలో శ్రీవారికి 501 కొబ్బరికాయలు సమర్పించారు. కార్యకర్తలు శ్రీవారి ఆలయం ముందున్న అఖిలాండం వద్దకు చేరుకుని కర్పూరం వెలిగించి గోవింద నామస్మరణలు చేస్తూ కొబ్బరికాయలు కొట్టారు. తిరుమల టీడీపీ అధ్యక్షుడు రాజుయాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. ఏపీకి పట్టిన దరిద్రం వదిలిపోయిందన్నారు. అధికారుల తీరు చూసి తిరుమల స్థానికులు కన్నీళ్లపెట్టుకున్న సందర్భాలు చాలానే ఉన్నాయన్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి తిరుమల స్థానికులందరూ హాజరవుతారన్నారు. ఈకార్యక్రమంలో శివషణ్ముగం, రాజేందర్‌రాజు, దేవరాజ్, ఆనంద్‌బాబు, హేమావతి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.


కొర్లగుంట జంక్షన్‌లో.. - చేపలమార్కెట్ వద్ద.. - ఆర్టీసీ బస్టాండులో.. - నిమ్మకాయల వీధిలో..

నగరంలో భారీ వాన

తిరుపతి అర్బన్, జూన్ 6: తిరుపతి నగరంలో గురువారం కూడా భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఆకాశంలో నల్లటిమేఘాలు కమ్మేశాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభమై దాదాపు గంటపాటు భారీ వాన పడింది. దీంతో నగరవీధులు, లోతట్టుప్రాంతాలు, కూరగాయల మార్కెట్, తిరుమల బైపాస్‌రోడ్డు, శ్రీనివాససేతు, ప్రధాన కూడళ్లు, రైల్వే అండర్ బ్రిడ్జీలు, ఆర్టీసీ బస్టాండు, నూతన మాస్టర్‌ప్లాన్‌రోడ్లలోనూ వర్షపునీరు ఏరులా ప్రవహించాయి. పలుచోట్ల కాలువల్లో మురుగు రోడ్లపై ప్రవహించింది. అక్కడక్కడా ట్రాఫిక్ అంతరాయమూ తలెత్తింది. ద్విచక్రవాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.

నేటినుంచి పాలిసెట్ ఆప్షన్స్ నమోదు

తిరుపతి(విద్య), జూన్ 6: పాలిసెట్‌లో ఆప్షన్స్ నమోదు ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమౌతుందని కోఆర్డినేటర్ డాక్టర్ వై.ద్వారకానాథరెడ్డి తెలిపారు. ఈనెల 10వ తేదీ వరకు ఆప్షన్ల నమోదు ప్రక్రియ జరగనుంది. 11న ఆప్షన్లలో మార్పు, చేర్పులు చేసుకోవచ్చు. 13వ తేదీన సీట్ అలాట్‌మెంట్ ఉంటుందని కోఆర్డినేటర్ వివరించారు. సీట్ అలాట్‌మెంట్ జరిగాక విద్యార్థులంతా అలాట్‌మెంట్ ఆర్డర్, జాయినింగ్ రిపోర్ట్, ఇతర ధ్రువపత్రాలను సంబంధిత కళాశాలలో సమర్పించాలని సూచించారు. కాగా, తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం 108001 పైబడిన ర్యాంకులొచ్చిన విద్యార్థులకు కౌన్సెలింగ్ జరిగింది. విద్యార్థుల ధ్రువపత్రాలను చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ జి.కృష్ణమూర్తినాయుడు, అసిస్టెంట్ కోర్డినేటర్ ఎస్.సుధీర్‌రెడ్డి, సిబ్బంది పరిశీలించారు.


ఆరణి శ్రీనివాసులును సన్మానిస్తున్న జనసేన నేత రాజారెడ్డి


ఎన్డీయే గెలుపుతో తిరుమలలో తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకున్న టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ. పక్కన ఊట్ల సురేంద్ర నాయుడు, ఎస్వీఎం శ్రీధర్

పోలీసు వాహనాల ధ్వంసం కేసులో 10మంది అదుపులోకి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 6 : గత నెల 14వ తేదీన మహిళా వర్సిటీ వద్ద చోటు చేసుకున్న ఘటనలపై సిట్ అధికారులు వివిధ కోణాల్లో విచారణ జరుపుతున్నారు.అలిపిరి సీఐ వాహనం, వజ్ర వాహనం ధ్వంసం చేసిన కేసులో తిరుపతి, రామచంద్రాపురం, చంద్రగిరి ప్రాంతాలకు చెందిన 10మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. వీరిలో ఇదివరకే పలు కేసుల్లో నిందితులుగా వున్న వారు ఇద్దరున్నట్లు తెలిసింది.మరోవైపు చంద్రగిరి ఎమ్మెల్యేగా ఎన్నికైన నానీపై జరిగిన హత్యాయత్నం కేసు విచారణలో వేగం పెరిగింది.కూచువారిపల్లివాసులతో పాటు టీడీపీ నాయకులపై వైసీపీ శ్రేణులు జరిపిన దాడుల్లో పలువురిపై కేసులు నమోదు చేశారు. అలాగే వైసీపీ నాయకులు, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గన్‌మెన్, పీఆర్వో ఇచ్చిన ఫిర్యాదులపై సైతం చంద్రగిరి పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసారు. వైసీపీ శ్రేణుల ఫిర్యాదులో పేర్కొన్నవారిలో వాస్తవంగా ఘటనల్లో పాల్గొన్న వారెవరనే వివరాలు సేకరిస్తున్నారు. వారం రోజుల్లో అన్ని కేసుల్లో దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్లు దాఖలు చేయాలనే ఆలోచనలో పోలీసులున్నట్లు తెలిసింది.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

గూడూరులో మోస్తరు వర్షం

గూడూరు అర్బన్, జూన్ 6: పట్టణంలో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం 4గంటల నుంచి 40 నిమిషాలపాటూ ఉరుములతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఈ సమయంలో విద్యుత్‌అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. వర్షం కారణంగా పట్టణంలోని ఆర్టీసీరోడ్డు, కుమ్మరవీధి, త్యాగరాజవీధి, మసీదువీధి తదితర ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా వాతావరణం చల్లబడింది.

వెంకటగిరి టౌన్ : పట్టణంలోని గురువారం మోస్తరు వర్షం పడింది. గురువారం వేకువజామున కూడా వర్షం పలసగా కురవడంతో ప్రజలు, రైతులు ఊరట చెందారు. మధ్యాహ్నం 3గంటల సమయంలో మబ్బులు కమ్ముకోవడంతో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అరాచక పాలనకు చరమగీతం : పాశం


ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

గూడూరు, జూన్ 6: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు ఈ ఎన్నికలలో ప్రజలు చరమగీతం పాడారని ఎమ్మెల్యేగా గెలుపొందిన టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం పలువురు నాయకులు అయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలు వైసీపీ పాలనతో విసిగిపోయి కూటమికి అత్యధిక విజయాన్ని అందించారన్నారు. ఇచ్చిన హామీలను చంద్రబాబు తప్పకుండా నెరవేరుస్తారన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలి


క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జనార్ధన్‌రెడ్డి

గూడూరు రూరల్, జూన్ 6: వేసవి శిక్షణా శిబిరంలో శిక్షణ పొందిన విద్యార్థులు భవిష్యత్తులో ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలని డాక్టర్ జనార్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఏఆరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గూడూరు క్రికెట్‌క్లబ్ ఆధ్వర్యంలో నెల్లూరుజిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో నెలరోజులపాటు నిర్వహించిన ఉచిత వేసవి క్రికెట్ శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ క్రీడల ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జాయింట్ సెక్రెటరీ మునిగిరీష్, లవకుమార్, జుల్కర్, నాగేశ్వరరావు, మధ, సుబ్రమణ్యం, విజయ్‌కుమార్, మహేష్, పూర్ణచంద్, సుధా, పవన్‌సాయి పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చి నగదు మాయం

తడ, జూన్ 6 : ఏటీఎం కార్డులో బ్యాలెన్స్ చూసిపెట్టు అని అడిగిన దానికి అతని కార్డును మార్చివేసి 10వేల రూపాయలను ఓ వ్యక్తి మాయం చేశాడు. మండల పరిధిలోని రామాపురం కుప్పం గ్రామానికి చెందిన పి. దేశప్పన్ బుధవారం తన బ్యాంక్ అకౌంట్‌లో బ్యాలెన్స్ వివరాలను తెలుసుకునేందుకు స్థానిక సిండికేట్ బ్యాంక్ ఏటీఎంలోకి వెళ్లాడు. అక్కడే ఉన్న ఓ వ్యక్తిని బ్యాలెన్స్ ఎంత ఉందో చూసిపెట్టాలంటూ ఏటీఎం కార్డు ఇచ్చి పిన్ నెంబరు చెప్పాడు. రూ.10,025 ఉన్నాయంటూ చెబుతూ ఏటీఎం కార్డును మార్చి అతడికి ఇచ్చేశాడు. ఆ తరువాత దేశప్పన్ ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి సమయంలో ఫోన్ చూసుకోగా అప్పటికే బ్యాంక్‌లో 25 రూపాయలు బ్యాలెన్స్ ఉన్నట్లుగా మెసేజ్ ఉండడంతో ఖంగుతిన్నాడు. గురువారం నేరుగా బ్యాంక్‌కు వచ్చి అధికారులకు పరిస్థితిని వివరించి విషయం తెలుసుకోగా 10వేల రూపాయలు ఏటీఎం ద్వారా డ్రా చేసినట్లుగా గుర్తించారు. సదరు వ్యక్తి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ విద్యుత్ కంచె తగిలి ఇద్దరికి గాయాలు

నాయుడుపేట టౌన్, జూన్6 : మండలంలోని శ్రీనివాసపురం సమీపంలో విద్యుత్ కంచె తగిలి ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు... శ్రీనివాసపురం గిరిజన కాలనీకి చెందిన అంకయ్య, వెంకటేశ్వర్లు గురువారం ఉదయం చేపల వేట కోసం బయలుదేరారు. కొంత దూరం వెళ్లిన తరువాత గుర్తుతెలియని వ్యక్తులు అడవి పందుల కోసం 11 కేవీ లైన్ నుంచి విద్యుత్ తీగలు లాగి కంచె ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఆ విద్యుత్ కంచెకు వెంకటేశ్వర్లు, అంకయ్య తగలడంతో గాయపడ్డారు. అదే సమయంలో విద్యుత్ ట్రిప్ అయింది. కాలనీవాసులు గమనించి గాయపడ్డ వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ గోపీ, విద్యుత్‌శాఖ ఏఈ వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమ విద్యుత్ కంచె ఏర్పాటు చేసిన వారిపై కేసు నమోదు చేసి చర్యలు చేపట్టబోతున్నట్లు తెలిపారు.

హామీలను నూరు శాతం అమలు చేసేందుకు కృషి : కురుగొండ్ల


టీడీపీ శ్రేణులతో కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూన్ 6: రాజకీయ ఉద్దండులకు కూడా మూడోసారి అవకాశం ఇవ్వని వెంకటగిరి ప్రజలు తనకు ఇచ్చారని కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ వెంకటగిరి ప్రజలు తనపై పెట్టు కొన్న నమ్మకాన్ని వమ్ముచేయనన్నారు. అభివృద్ధి, సంక్షేమం తనకు రెండు కళ్లన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసేందుకు తన శక్తి వంచనలేకుండా కృషి చేస్తానన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమేనని, ప్రతిపక్ష నాయకులను శత్రువులుగా బావించకుండా వారి సలహాలు, సూచనలను తీసుకొని ముందుకు పోతానన్నారు. తన తప్పులను ప్రతిపక్ష నాయకులు ఎత్తి చూపితే వాటిని సరిచేసుకుంటానన్నారు. కార్యక్రమంలో నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, సింగంశెట్టి బాస్కర్, బీరం రాజేశ్వరం, కేవీకే ప్రసాద్ నాయుడు, గొల్లగుంట మురళీ, కాపా శ్రీనివాసులు నాయుడు, ఏల్లేశ్వరం రామచంద్రయ్య, పునుగోటి విశ్వనాథనాయుడు, శాంతారావు, నల్లబోతుల మురళి, రమణారెడ్డి, మంకు ఆనంద్ పాల్గొన్నారు.

చిల్లకూరులో టీడీపీ విజయోత్సవ ర్యాలీ

చిల్లకూరు, జూన్ 6: చిల్లకూరులో గురువారం టీడీపీ నాయకుడు తానంకి నానాజీ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా పేల్చుతూ ఓటర్లకు అభివాదం చేస్తూ టీడీపీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తానంకి నానాజీ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలను పరిష్కరిస్తూ, నియోజకవర్గ అభివృద్ధిని ఆకాంక్షించే పాశం సునీల్‌కుమార్‌కు ప్రజలు పట్టం కట్టారన్నారు. అనంతరం దుర్గమ్మ, దేశమ్మ, రాజరాజేశ్వరిదేవి, గంగమ్మ, మాతమ్మ, సుందరమ్మ, అభయ కోదండరాస్వామి ఆలయాల్లో టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, దాసరి రాము, తానంకి సతీష్, బెల్లకొండ మల్లికార్జున్, నవీన్‌చంద్ర, అశోక్, జగదీష్, వినోద్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు సన్మానం

పెళ్లకూరు, జూన్ 6 : టీడీపీ విజయం కోసం రాత్రి పగలు కష్టపడి పనిచేసిన ఆ పార్టీ కార్య కర్తలు రమేష్, వెంకటేష్‌లకు టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు కన్నలి వాసు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి బంగారు ఉంగరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బైనా సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ కోర్సుల్లో అడ్మిషన్లు

వెంకటగిరి టౌన్/వెంకటగిరి, జూన్6: విశ్వోదయ ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో ఇంటర్మీడియట్‌కు అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈహెచ్‌తోపాటు ఒకేషనల్ బీఅండ్‌ఆర్‌ఎం, ఎంఎల్‌టీ, ఈటీ గ్రూపులకు అడ్మిషన్స్ జరుగుతున్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

నాయుడుపేట టౌన్, జూన్6 : నాయుడుపేట మల్లాం కూడలి సమీపంలో లారీ ఢీ కొన్న ఘటనలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు ...మల్లాం జంక్షన్ ప్రాంతంలో ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొనడంతో ఆ వ్యక్తి తల పూర్తిగా నలిగిపోయింది. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయసు 50 ఏళ్లు ఉంటుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

సూళ్లూరుపేట, జూన్ 6: సూళ్లూరుపేటలోని వీఎస్ ఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జేకేసీ, అవంతి లెదర్ కంపెనీ వారు జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 50మంది హాజరుకాగా వారిలో 28మందిని ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ తెలిపారు. కార్యక్రమంలో అవంతి లెదర్ కంపెనీ సీఈవో పాల్, జనరల్ మేనేజర్ లీలాకృష్ణ, హెచ్‌ఆర్ గణేష్, జేకేసీ కో ఆర్డినేటర్ ప్రసాద్ పాల్గొన్నారు.

10న కౌన్సిల్ సమావేశం

సూళ్లూరుపేట, జూన్ 6: సూళ్లూరుపేట మున్సిపాలిటీ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 10న గాండ్లవీధిలోని స్త్రీశక్తి భవనంలో చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ చెల్లు గంగాప్రసాద్ తెలిపారు. ఈ సమావేశానికి వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పకుండా హాజరుకావాలని పేర్కొన్నారు.

సోమిరెడ్డికి సన్మానం



నాయుడుపేట టౌన్, జూన్ 6 : సర్వేపల్లి నుంచి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో నాయుడుపేటకు చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ కాలేషా ఆధ్వర్యంలో గురువారం నెల్లూరులో ఆయనను సన్మానించారు. సన్మానించిన వారిలో అంజయ్య, రమణమూర్తి తదితరులు ఉన్నారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు అర్బన్, జూన్ 6: స్థానిక ఏరియా ఆసుపత్రిలో గురువారం ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో డాక్టర్లు జనార్ధన్‌రెడ్డి, రోహిణీల దాతృత్వంతో రోగులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ షరీనా, కడివేటి చంద్రశేఖర్, జీ చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాము, కుమార్, నాగరాజు, సతీష్ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

వెంకటగిరిటౌన్, జూన్ 6: పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌లో తన ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ తులసీజ్యోతి తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు స్కాలర్‌షిప్ కోసం విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాశారని తెలిపారు. ఈ పరీక్షల్లో వెంకటనాగసాయి సుందన, రక్షిత, మునిజస్విత, గీతిక, ముని పూజిత, వెన్నెల, గౌతమ్‌ల ప్రతిభ చాటారని అన్నారు. వీరికి ప్రభుత్వం ప్రతి నెలా రూ. 12వేలు అందజేస్తుందన్నారు.

నాడు-నేడు పనుల తనిఖీలు

కోట, జూన్ 6 : మండల పరిధిలోని గూడలి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను గురువారం ఎంఈవో దారా మస్తానయ్య తనిఖీ చేశారు. ఇక్కడ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు కింద అదనపు గదుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఎంఈవో మస్తానయ్య, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పనులను స్వయంగా పర్యవేక్షించి పనులలో నాణ్యత లోపించకుండా చేయాలన్నారు.

సత్యకుమార్‌కు సన్మానం



నాయుడుపేట, జూన్ 6 : ధర్మవరం బీజేపీ ఎమ్మెల్యేగా విజయం సాధించిన వైసత్యకుమార్‌ను గురువారం విజయవాడలో నాయుడుపేట బీజేపీ నాయకులు శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. ఆంధ్రరాష్ట్రంలో ఎన్డీఏ కూటమి భారీ మెజార్టీ రావడం ప్రజలకు ఎన్డీఏ పట్ల ఉన్న విశ్వసనీయత తేటతెల్లమైందని అన్నారు. సత్యకుమార్‌ను అభినందించిన వారిలో బీజేపీ నాయకులు బొల్లకాయల విజయభాస్కర్, ఆశా చెంచు కృష్ణయ్య, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

ఆనం, సోమిరెడ్డిని కలిసిన టీడీపీ మహిళా నేత

సూళ్లూరుపేట, జూన్ 6: సూళ్లూరుపేట మండలం కోటపోలూరుకు చెందిన టీడీపీ మహిళా నాయకురాలు ఇసనాక శ్రీవాణి గురువారం సర్వేపల్లి, ఆత్మకూరు ఎమ్మెల్యేలుగా గెలిచిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డిలను కలిసి పుష్పం అందజేసి అభినందనలు తెలిపారు. వైసీపీ కంచుకోట కోటపోలూరులో టీడీపీ అధిక మెజార్టీ వచ్చేందుకు కృషిచేసిన వాణిని సోమిరెడ్డి, ఆనం అభినందించారు. అందుకుముందు ఆమె సత్యవేడు ఎమ్మెల్యేగా ఎన్నికైన కోనేటి ఆదిమూలంను కలిసి అభినందనలు తెలిపారు.

సోమిరెడ్డిని కలిసిన మౌనికారెడ్డి

డక్కిలి, జూన్ 6 : సర్వేపల్లి ఎమ్మెల్యేగా విజయం సాధించిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని డక్కిలి మండలం వెలికల్లుకు చెందిన మౌనికా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు మౌనికారెడ్డి గురువారం నెల్లూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

వైసీపీని చావుదెబ్బ కొట్టిన పట్టణ ఓటరు

- సూళ్లూరుపేట పట్టణంలో భారీ ఆధిక్యత
- రూరల్ ప్రాంతాల్లో సాధారణ మెజార్టీ

తడ, జూన్6 : వైసీపీ సాగించిన దౌర్జన్యకాండకు పట్టణ ఓటర్లు వైసీపీని కోలుకోలేని చావుదెబ్బ కొట్టారు. ఈ దెబ్బకు వైసీపీ శ్రేణులు బిత్తర పోయాయి. 2014 ఎన్నికల నుంచి సూళ్లూరుపేట నియోజకవర్గంలో వరుసగా వైసీపీ గెలుస్తూ వచ్చింది. మొదటిసారి 3,726 ఓట్ల ఆధిక్యతతో గెలుపు అందుకున్న ఆ పార్టీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య, 2019లో 62,120 ఆధిక్యతతో విజయం సాధించారు. అందులో పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ఆ పార్టీకి మెజార్టీ దక్కింది. ఓజిలిలో 7,947, నాయుడుపేటలో 13,848, పెళ్లకూరులో 8,942, దొరవారిసత్రంలో 9,601, సూళ్లూరుపేటలో 11,235, తడ మండలాలలో 9062 ఓట్ల ఆధిక్యత లభించింది. దీంతో ఆ పార్టీకి తిరుగులేదన్న భావనకు వచ్చేసింది. అప్పటి నుంచి వైసీపీ సాగించిన దౌర్జన్యకాండకు ఓటర్లు బిత్తరపోయారు. గంజాయి విచ్చలవిడి అయిపోయింది. సెటిల్‌మెంట్‌లు నిత్యకృత్యమైపోయాయి. దీంతో పట్టణ ఓటర్లల్లో ఆందోళన కనబడింది. మరో సారి వీరికి అధికారం అప్పజెప్పితే ఏమవు తామో అన్న భయం కలిగింది. ఈ క్రమంలో ప్రస్తుత ఎన్నికల్లో మొత్తం 2,03,421 ఓట్లకుగాను 1,99,715 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో టీడీపీకి 1,11,048 ఓట్లు రాగా, వైసీపీకి 81,933 ఓట్లు దక్కాయి. అయితే రూరల్ ప్రాంతంలో వ్యతిరేకత కల్పించినా ఓట్ల రూపంలో వచ్చేసరికి టీడీపీకి సాధారణ మెజార్టీయే దక్కింది. అందులో ఓజిలి మండలంలో 497, పెళ్లకూరులో 1639, దొరవారిసత్రంలో 2,226, తడ మండలంలో 2,517 ఓట్ల మెజార్టీ మాత్రమే దక్కింది. అయితే పట్టణ ఓటర్లల్లో కలిగిన భయాన్ని ఓటర్లు తమ ఓటు ద్వారా వైసీపీకి చుక్కలు చూపించారు. ముఖ్యంగా సూళ్లూరుపేటలో టీడీపీకి 30,296 మంది ఓట్లు వేయగా, వైసీపీకి 17,217 మంది ఓట్లు వేయడంతో టీడీపీ అభ్యర్థికి ఒక్క సూళ్లూరుపేటలోనే 13,079 ఓట్ల భారీ ఆధిక్యత లభించింది. ఇది సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఏర్పడిన నాటి నుంచి వచ్చిన మెజార్టీలలో అతి పెద్ద మెజార్టీగా చెప్పవచ్చు. కాని నాయుడుపేటలో 8,404 ఓట్ల ఆధిక్యత మాత్రం దక్కింది. ఇలా వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతతోపాటు పట్టణాలలో వైసీపీ నాయకుల దౌర్జన్యకాండకు పట్టణ ఓటర్లు తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పినట్లు అయ్యింది.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి గెలిపించారు : టీడీపీ

చిల్లకూరు, జూన్ 6: చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నమ్మి ప్రజలు కూటమిని అత్యధిక స్థానాలలో గెలిపించారని టీడీపీ సీనియర్ నాయకుడు, పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక టీడీపీ నాయకుడు తానంకి నానాజీ నివాసంలో గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, సత్యవేడు స్థానాల్లో గెలిచిన పాశం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, కోనేటి ఆదిమూలంతో కలిసి కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు కూటమిని గెలిపించారన్నారు. ఈ ఎన్నికల్లో యువత, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు కూటమి అండగా నిలిచారన్నారు. గాడితప్పిన పాలనను అభివృద్ధి పథంలో నడిపించే సత్తా చంద్రబాబునాయుడుకే ఉందన్నారు. కూటమి సహకారంతో రాష్ట్రాన్ని చంద్రబాబు భివృద్ధిపథంలో నడిపిస్తారన్నారు. అనంతరం గెలిచిన అభ్యర్థులందరూ చంద్రబాబును కలిసేందుకు విజయవాడకు తరలివెళ్లారు. కార్యక్రమంలో తానంకి నానాజీ, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, గణపర్తి కిషోర్‌నాయుడు, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, గంటా మధుకృష్ణ, పెనుబోలు జానకిరామిరెడ్డి, తానంకి సతీష్, వెంకటేశ్వర్లునాయుడు, మల్లికార్జున్, నవీన్, వినోద్, కోటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.


విజయవాడకు వెలుతున్న గంగాప్రసాద్, గెలిచిన అభ్యర్థులు

సంపూర్ణ సంక్షేమం, అభివృద్ధే ఎన్డీఏ ధ్యేయం


విజయశ్రీకి స్వీట్ తినిపిస్తున్న మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ శోభారాణి, కేక్ కట్‌చేసి కార్యకర్తలకు తినిపిస్తున్న వెంకటతేజ, కేవీ నాయుడు

నాయుడుపేట, జూన్ 6 : రాష్ట్రంలో, దేశంలో ప్రజలకు సంపూర్ణ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా గెలచిన డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేటలో గురువారం మున్సిపల్ మాజీ చైర్మన్ మైలారి శోభారాణి-రాజశేఖర్ దంపతులు విజయశ్రీకి శుభాకాంక్షలు తెలియజేసి స్వీట్‌లు అందజేశారు. విజయశ్రీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, అధికారులతోపాటు నాయకులతో సమీక్షించి ఆ మేర అభివృద్ధి పనులను పూర్తిచేసేలా కృషి చేస్తామన్నారు. ప్రజలకు మౌళిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. విజయశ్రీని పలువురు నాయకులు, అభిమానులు, ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు.

పెళ్లకూరు : సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా డాక్టర్ నెలవల విజయశ్రీ విజయం సాధించడంతో మండలంలోని రావులపాడులో టీడీపీ రైతు విభాగ అధ్యక్షుడు కేవీ నాయుడు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణా సంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం టీడీపీ ప్రవాస భారతీయుడు పేరం వెంకటతేజ, సందీప్‌తేజ కేక్‌కట్ చేసి అందరికి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో చంద్రయ్యనాయుడు, బాలయ్యనాయుడు, రమేష్‌నాయుడు, రవి, గజేంద్రనాయుడు, మహేష్‌నాయుడు, ఉదయ్‌నాయుడు, నరేంద్రనాయుడు తదితరులు ఉన్నారు.

విజయశ్రీకి అభినందనలు



పెళ్లకూరు, జూన్ 6 : సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన డాక్టర్ నెలవల విజయశ్రీకి మండలంలోని పెన్నేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గాలి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు ఏడుకొండలు, నాయకులు పెంచలయ్య, హర్ష, వెంకటసుబ్బయ్య, వంశీ తదితరు ఉన్నారు.

సోమిరెడ్డికి టీడీపీ నేతల అభినందనలు



పెళ్లకూరు, జూన్ 6 : సర్వేపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన టీడీపీ రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి పెళ్లకూరు మండల టీడీపీ నేతలు గురువారం కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి పెళ్లకూరు మండలంలో పార్టీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్, టీడీపీ సీనియర్ నేతలు పేరం రమేష్‌నాయుడు, మధుసూధన్‌నాయుడు, టీడీపీ ప్రవాస భారతీయుడు పేరం వెంకటతేజ, సందీప్‌తేజ, హరినాయుడు తదితరులు ఉన్నారు.

కూటమి నాయకుల సంబరాలు



వాకాడు, జూన్ 6 : టీడీపీ కూటమి గెలిచిన సందర్భంగా గురువారం వాకాడులోని టీడీపీ నాయకులు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కూటమి నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, గూడూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డిల ఆధ్వర్యంలో కేక్‌ను కట్‌చేసి కార్యకర్తలకు తినిపించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దోశకాయల కృష్ణమూర్తి, నందగోపాల్‌రెడ్డి, కుంచం దయాకర్, చరణ్‌రెడ్డి, విన్నమాల ద్వారకానాథ్‌రెడ్డి, కళావల్లి ప్రసాద్, బత్తిన ప్రమీల, చిరంజీవమ్మ, గంగాధర్‌రెడ్డి, షేక్ గౌస్‌మోహిద్దీన్, మదర్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల లక్ష్యం 202 కోట్లు

కోట, జూన్ 6 : జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను పొదుపు సంఘాలకు రూ.202 కోట్ల స్త్రీనిధి రుణాల ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నామని స్త్రీనిధి రుణాల అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి. హేమంత్‌కుమార్ తెలిపారు. కోటలోని వైఎస్ఆర్ క్రాంతిపథం కార్యాలయంలో గురువారం స్త్రీనిధి రుణాల రికవరీపై సీసీలు, వీవోఏలతో సమీక్ష జరిగింది. ఇప్పటివరకు కోట మండలానికి మంజూరైన స్త్రీనిధి రుణాలు, రికవరీలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఆయా సీసీలకు రుణాల రికవరీపై కొన్ని లక్ష్యాలను ఇచ్చారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 162 కోట్లు స్త్రీనిధి రుణలక్ష్యం ఉండగా, 169.3 కోట్లను రుణాలను ఇచ్చామన్నారు. కోట మండలానికి ఈ ఏడాది స్త్రీనిధి రుణాల లక్ష్యం 6.18 కోట్ల రూపాయలు లక్ష్యంగా ఉందన్నారు. సమావేశంలో స్త్రీనిధి మేనేజర్ జయకుమార్, సీసీలు శ్రీకాంత్, భాస్కర్, ప్రసాద్, శంకరయ్య, కృష్ణమ్మ, బిందు, తదితరులు ఉన్నారు.

చెరువుల్లో పడిపోయిన మత్స్యసంపద


41 చెరువుల్లో ఆగిన వేలం పాటలు

కోట, జూన్6: ఈ ఏడాది చెరువుల్లో మత్స్యసంపద (చేపలు) ఉత్పత్తులు బాగా పడిపోయాయి. ప్రతి ఏటా జూన్, జూలై మాసం వరకు చెరువుల్లో అరకొరగా నీరు ఉండటం పరిపాటి. ఈ ఏడాది చెరువుల్లో మత్స్యసంపద జాడే కన్పించకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సముద్ర తీర ప్రాంత మండలం అయిన కోటలో 30 నీటి పారుదల, 25 పంచాయతీరాజ్ శాఖకు చెందిన చెరువులున్నాయి. ఆయా చెరువుల కింద వందల నుంచి వేలాది ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. ప్రతి ఏటా కురిసే వర్షాలకు ఎగువభాగం నుంచి చేపలు రావడమేకాకుండా సహజసిద్ధంగా ఆయా చెరువుల్లో మత్స్యసంపద బాగా వృద్ధి చెందుతుంది. ఆయా చెరువులను నమ్ముకొని వందలాది కుటుంబాల గిరిజనులు, గిరిజన సొసైటీలు మత్స్యసంపదే ఆధారంగా కుటుంబాలను పోషించుకుంటున్నారు.


కోట మండలం చంద్రశేఖరపురం చెరువు ఎండిపోయి ఉన్న లోతట్టు భాగం

ఈ ఏడాది మేజర్ చెరువులైన పెన్నక్క, అల్లంపాడు, వంజివాక, ఉత్తమనెల్లూరు తదితర గ్రామాల్లోని చెరువుల్లోని నీరు ఇంకిపోయింది. పెన్నక్క చెరువులో మాత్రం నీరు ఉన్నప్పటికి మత్స్యసంపద లేకపోవడంతో గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధార ణంగా చెరువుల్లోని చేపలను పట్టుకునేందుకు పంచాయతీలు వేలంపాటలు నిర్వహిస్తారు. ఈ ఏడాది చెరువుల్లో చేపలు వృద్ధి ఘననీయంగా పడిపోవడంతో చేపల వేలంపాటలు దాదాపు జరగలేదు. ప్రతి ఏటా తెలుగుగంగ 5వ బ్రాంచ్ కెనాల్ నుంచి కోట మండలంలోని పలు చెరువులకు సాగునీరు వదులుతారు. ఈ ఏడాది ఒక్క కేశవరం, కొండుగుంట, రాఘవా పురం చెరువులకు గంగనీరు వదలండంతో మిగతా చెరువులకు నీరు వదల లేదు. దీని కారణంగా కూడా మత్స్యసంపద వృద్ధి చెందలేదని ఆయా గ్రామా ల ప్రజలు, గిరిజనులు చెబుతున్నారు. ఏదీ ఏమైనప్పటికి ఈ ఏడాది చెరువు ల్లోకి మత్స్యసంపద రాకపోవడం, అరకొరగా ఉన్నచేపలు నీళ్ల లేక చని పోవడంతో గిరిజనులు, మండల ప్రజలు ఆశలు ఎండమావిగా మిగిలాయి.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, జూన్ 6: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మేధో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేశారు. అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక క్రతువులు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి, దూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



శ్రీకాళహస్తి, జూన్ 6: పట్టణంలోని వీవీ రోడ్డులోని అంకాలమ్మ ఆలయం వద్ద అమావాస్యను పురస్కరించుకుని గురువారం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా ప్రతి అమ్మవాస్యకు భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. గోవర్ధన్‌రావు, యశ్వంత్‌రావు, కాంత్రి కుమార్, డాక్టర్ కృపానిధి, ఉపేందర్‌రెడ్డి, రాఘవేంద్ర, సావిత్రిబాయి, మాధవ, సాయి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల మొక్కుల చెల్లింపు



కొబ్బరి కాయలు కొడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, జూన్ 6: కూటమి అధికారంలోకి రావడంతో పాటు శ్రీకాళహసిలో బొజ్జల సుధీర్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతో టీడీపీ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద గురువారం మద్దిలేడుకు చెందిన టీడీపీ నాయకులు 101 కొబ్బరికాయలను కొట్టారు. టీడీపీ నాయకులు జంగం గురవయ్య, గిరి, అజయ్, వంశీ, ప్రదీప్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఏర్పేడు, జూన్ 6: స్విమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గ్రామాలకు వచ్చే పింకుబస్సులో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని వైద్య బృందం సూచించింది. కోబాక, పాత వీరాపురం పంచాయతీల్లో గురువారం క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల, అవగాహన కార్యక్రమం జరిగింది. మహిళలకు మమోగ్రఫీ, అల్ట్రాసౌండ్, సెర్వీకల్ పరీక్షలు నిర్వహించారు. అనుమానితులను పింక్‌బస్సులో గుర్తించారు. కోబాక మాజీ సర్పంచ్ సూర్యనారాయణ సహకరించారు. స్విమ్స్ క్యాన్సర్ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, వైద్యులు మానస, ఏర్పేడు పీహెచ్‌సీ వైద్యులు సురేష్ బాబు, కొత్తవీరాపురం హెచ్‌డబ్ల్యూసీ స్టాఫ్, సీహెచ్‌వో కృష్ణవేణి తదితరులు స్క్రీనింగ్ పరీక్షల్లో పాల్గొన్నారు.

సికిల్‌పిల్ ఎనీమియాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 6: గాజులపెళ్ళూరు పంచాయతీలోని ఆదిలక్షయ్య గిరిజన కాలనీలో గిరిజనులకు సికిల్‌పిల్ ఎనీమియా వ్యాధిపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దివాకర్ సీహెచ్‌వో వెంకటేశ్వర్లు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ సికిల్ పిల్ ఎనీమియా జీవిత కాలవ్యాధి అన్నారు. రక్తంలో ఎర్ర రక్త కణాలలో వృత్తాకార బిళ్లల రూపంలో ఉంటుందన్నారు. దీనివల్ల రక్త ప్రసరణ తగ్గుతుందన్నారు. స్ట్రోక్, కంటి సమస్యలు, ఆర్గానిక్స్ దెబ్బతింటాయన్నారు. కాలనీలో వ్యాధి అధికంగా ఉండటంతో టెస్టులు చేసి బాధితులను గుర్తిస్తామన్నారు.

మాజీ సర్పంచ్ రమణయ్య మృతి

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 6: మండలంలోని గాజులపెళ్ళూరు గ్రామ మాజీ సర్పంచ్, గొర్రెలు, మేకల పెంపకం దారుల జిల్లా డైరెక్టర్ రమణయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈయన మృతదేహానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా గొర్రెల, మేకల పెంపకం దారుల అధ్యక్షుడు, రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ ప్రకాష్, జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రజని, జిల్లా డైరెక్టర్లు అంబాకం చిన్నిరాజ్, వెంకటయ్య, పశువైద్యులు హరీష్‌కుమార్‌లు నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

నాదెండ్ల మనోహర్‌ను కలిసిన వినుత

శ్రీకాళహస్తి, జూన్ 6: ఎమ్మెల్యేగా ఎన్నికైన జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను తెనాలిలో గురువారం శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత కలిశారు. ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా కోట వినుత మాట్లాడుతూ వందశాతం సీట్లు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

బాధితురాలి వైద్యానికి భరోసా

శ్రీకాళహస్తి, జూన్ 6: తొట్టంబేడు మండలం ఇలగనూరు ఎస్టీకాలనీలో పక్షవాత బాధితురాలు రమణమ్మను గురువారం టీడీపీ మండలాధ్యక్షుడు గాలి మురళీనాయుడు పరామర్శించారు. ఆరోగ్యశ్రీ వర్తించదని వైద్యులు చెప్పారనే విషయం తెలుసుకున్న మురళీ నాయుడు వారితో మాట్లాడారు. భర్తకు పింఛనును నిలిపివేశారని..ఇంటికి తాగునీటి సరఫరాను నిలిపివేశారని వారు వద్ద మొరపెట్టుకున్నారు. బొజ్జల సుధీర్‌రెడ్డితో మాట్లాడి ప్రభుత్వం ద్వారా ఆర్థికసాయం అందజేస్తామని భరోసా కల్పించారు.

బొజ్జల సుధీర్‌రెడ్డికి సన్మానం

వరదయ్యపాళెం, జూన్ 6: శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా ఎన్నికైన బొజ్జల సుధీర్‌రెడ్డి శ్రీకాళహస్తిలో వరదయ్యపాళెం టీడీపీ నాయకులు మల్లికార్జుననాయుడు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

శ్రీకాళహస్తి, జూన్ 6: టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ తాటిపర్తి ఈశ్వరరెడ్డిని ఎమ్మెల్యేగా గెలుపొందిన బొజ్జల సుధీర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఎంపేడులోని ఈశ్వరరెడ్డి స్వగృహానికి వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సుధీర్‌రెడ్డిని వారు అభినందించారు. మాజీ సింగిల్ విండో చైర్మన్ తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నగరి ఎమ్మెల్యేగా ఎన్నికైన గాలి భానుప్రకాష్‌ను సత్కరిస్తున్న పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, గాలి గోపి కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి
సత్యవేడు



చంద్రబాబును కలసిన సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూన్ 6: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును గురువారం విజయవాడలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా ఎన్నికైన బొజ్జల సుధీర్‌రెడ్డి కలిశారు. ఆయనను ముక్కంటి శేషవస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. సుధీర్‌రెడ్డిని చంద్రబాబునాయుడు అభినందించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 6: పద్మావతిపురం వద్ద కేటి రోడ్డుపై కారు ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనాదారుడుకి తీవ్ర గాయాలయ్యాయి. నీర్పాకోటకు చెందిన దామతొట్టి అఖిలేష్ గురువారం శ్రీకాళహస్తి నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా తడ నుంచి శ్రీకాళహస్తి వైపు వస్తున్న కారు ఢీకొంది. అఖిలేష్‌కు రెండు చోట్ల కాలు విరిగిపోయింది. పోలీసులు సంఘటన స్థలం చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వక్ఫ్‌బోర్డు మెంబరు రాజీనామా

వరదయ్యపాళెం, జూన్ 6: జిల్లా వక్ఫ్‌బోర్డు పదవికి షేక్ అబ్దుల్ గురువారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎనినకల ఫలితాల ప్రజాతీర్పును గౌరవిస్తూ పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. సహకరించిన అధికారులు, మైనార్టీలు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అదుపు తప్పిన టిప్పర్

వరదయ్యపాళెం, జూన్ 6: శ్రీసిటీ వద్ద అదుపు తప్పి ఓ టిప్పర్ గోడను ఢీకొంది. శ్రీసిటీ ఎస్ఐ గౌస్‌పీర్ కథనం మేరకు శ్రీసిటీ కంపెనీలకు జిప్సం తీసుకుని వస్తున్న టిప్పర్ జడ్‌టీటీ పరిశ్రమ వద్ద గోడను, విద్యుత్ స్తంభాన్ని, పార్కింగ్ చేసిన కారును ఢీకొంది. దీంతో కారు ధ్వంసమైంది. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. డ్రైవర్ కూడా ప్రమాదం నుంచి బయటపడ్డాడు.

రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడి మృతి



రేణిగుంట, జూన్ 6: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు రైల్వే విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినపడి ఉండటాన్ని స్థానికులు గురువారం గుర్తించారు. మృతునికి 75 ఏళ్లుంటాయి. రైలు కిందపడి ఆత్మహత్యకు ప్రయత్నిస్తుండగా కొందరు గుర్తించారు. శరీరంపై లుంగీ, షర్టు ఉన్నాయి.

తప్పుడు కథనాలతో ప్రచారం చేస్తే చర్యలు

రేణిగుంట, జూన్ 6: ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు కథనాలు ప్రచారం చేస్తే చర్యలు తప్పవని రేణిగుంట అర్బన్ సీఐ మల్లికార్జున్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత కక్షల వల్లగానీ ఆర్థిక నేరాలు, కుటుంబ కలహాలను ఉద్దేశపూర్వకంగా పార్టీలకు ఆపాదిస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేసినా, యూట్యూబ్ చానల్ ప్రసారాలు చేసినా శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. వాస్తవాలు గ్రహించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఘనసన్మానం



సుధీర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న మునగలపాళెం గ్రామస్థులు

ఏర్పేడు, జూన్ 6: ఎమ్మెల్యేగా ఎన్నికైన బొజ్జల సుధీర్‌రెడ్డిని మండలం టీడీపీ నాయకులు గురువారం సన్మానించారు. మునగలపాళెం గ్రామానికి చెందిన సర్పంచ్ మంజుభార్గవి, సతీష్‌నాయుడు, మోహన్‌రావు, చెల్లూరు సర్పంచ్ జ్ఞానప్రసూనాంబిక, టీడీపీ సీనియర్ నాయకులు సుధీర్‌బాబు, పురోషోత్తం నాయుడు, మునిరామచంద్ర, వెంకటేష్, జనార్ధన్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఏర్పేడు మండలాన్ని మరింత అభివృద్ధి చేయాలని సుధీర్‌రెడ్డిని వారు కోరారు. వికృతమాల మాజీ సర్పంచ్ పూల హేమాక్షి ఆధ్వర్యంలో గ్రామస్థులు సుధీర్‌రెడ్డిని సన్మానించారు.

పుత్తూరు వార్తలు

ఎన్డీఏలో టీడీపీ భాగస్వామ్యం రాష్ట్రానికి సానుకూల అంశం



తిరుమలలో కుటుంబ సభ్యులతో భానుప్రకాష్

తిరుమల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమిలో టీడీపీ పెద్ద భాగస్వామ్యాన్ని తీసుకుందని, రాష్ట్రానికి మంచిరోజులు రాబోతున్నాయని ఆ పార్టీ నగరి ఎమ్మెల్యేగా గెలిచిన గాలి భానుప్రకాష్ అన్నారు. రాష్ట్ర హక్కులు, రావాల్సిన నిధులు తెచ్చుకుంటామన్నారు. ఎన్డీఏలో టీడీపీ భాగస్వామ్యం రాష్ట్రానికి సానుకూలమైన అంశమన్నారు. నగిరి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలందరూ వన్‌సైడ్ ఉండి రాష్ట్రాన్ని కాపాడుకుందామనే సందేశం ఇచ్చారన్నారు. స్వామి దయ, ప్రజల ఆశీస్సులతో మంచి ప్రభుత్వం ఏర్పడనుందని చెప్పారు.

భానుపై దాడుల ఫలితమేనా భారీ ఆధిక్యత?

- రోజా ఓటమే లక్ష్యంగా కసితీరా పనిచేసిన టీడీపీ కేడర్

పుత్తూరు అర్బన్, జూన్ 6: ఐదేళ్లు... నియోజకవర్గంలో రూల్ ఆఫ్ లాకు పాతరేశారు.... పోలీసు స్టేషన్లను అధికార పార్టీకి గెస్ట్ హౌస్‌లుగా మార్చుకున్నారు... ఏకంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్‌పై భౌతిక దాడికి పాల్పడే స్థాయికి బరితెగించారు... ఫిర్యాదు చేస్తే తిరిగి రివర్స్ కేసులతో వేధించారు. దౌర్జన్యాలు, దాడులతో అరాచకాన్ని సృష్టించారు. దీంతో కడుపు రగిలిన టీడీపీ కేడర్ రోజా ఓటమికి కసితీరా పనిచేశారు. దీని ఫలితమే రికార్డు మెజార్టీ అని భావిస్తున్నారు.

రోజా ఓటమికి తొలి నాంది....

గతుడాది అక్టోబర్‌లో నగరి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గాలి భానుప్రకాష్‌ను వైసీపీ కార్యకర్తలు కర్రలు, రాడ్లతో అడ్డగించారు. భౌతికదాడికి యత్నించారు. ఈ క్రమంలో కారు ధ్వంసమైంది.డ్రైవర్ విజ్ఞతతో వ్యవహరించడంతో ఆయన తప్పించుకున్నారు. దీంతో టీడీపీ కేడర్ అప్పటికప్పుడు భానుప్రకాష్‌కు మద్దతుగా నగరి వచ్చి భారీ ర్యాలీతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు తిరిగి ఆయనపైనే కేసు నమోదు చేశారు. దీనిపై పుత్తూరులో భారీ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. లాఠీలతో విరుచుకుపడ్డారు.

ఏకంగా 13 కేసులు...

2019లో అధికారంలోకి వచ్చాక వైసీపీ కన్నుమిన్ను కానరాకుండా ప్రవర్తించింది. భానుప్రకాష్ టార్గెట్‌గా పోలీసు కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేంది. ఈ ఐదేళ్లలో పుత్తూరు, నగరి పరిధిలో 13 కేసులు నమోదు చేయించింది. ఎన్నికలయ్యాక కూడా పుత్తూరులో కేసు నమోదు చేశారంటే పోలీసు అధికారుల ఏకపక్ష తీరు తెలుస్తోంది. గతేడాది చంద్రబాబునాయుడు అరెస్ట్ సందర్భంగా నిరసన తెలిపేందుకు కూడా అనుమతివ్వలేదు. తిరుపతి నుంచి పుత్తూరుకు చేరుకునేందుకు నానా అవస్థలూ పడ్డారు.

కసి తీరా పనిచేసిన కేడర్....

వరుసగా కార్యకర్తలు, నాయకులతో పాటు గాలి భానుప్రకాష్‌పై కూడా కేసులు, అణచివేతలతో వ్యవహరించిన రోజాను ఓడించేందుకు కేడర్ ప్రతిజ్ఞ పూనేలా చేసింది. శపథిషాలను పక్కన పెట్టారు. వైసీపీ కేడర్‌ను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేసి సఫలమయ్యారు. ఎన్నికల షెడ్యూల్ మొదలైనప్పటి నుంచి తామే అభ్యర్థి అనేలా కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల రోజుకు ముందు కీలకమైన పోల్ మేనేజ్‌మెంట్, బూత్ మేనేజ్‌మెంట్‌లో శ్రమించి పనిచేశారు. ఫలితంగా నియోజకవర్గ చరిత్రలో ఇప్పటి వరకు లేని విధంగా 45,004 ఓట్ల మెజార్టీ సాధించడంలో కీలకపాత్ర పోషించారు. అధికారం తెచ్చిన అహంకారంతో విచ్చలవిడిగా ప్రవర్తించిన వైసీపీ శ్రేణులు, ఎమ్మెల్యే అభ్యర్థి రోజా భారీ మూల్యమే చెల్లించిందనే మాటలు వినబడుతున్నాయి.



భానుప్రకాష్‌పై దాడికి పుత్తూరులో నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ కేడర్‌ను అదుపు చేస్తున్న పోలీసులు (ఫైల్ ఫోటో)

వాగివేడులో మాజీ వలంటీర్ల రగడ

- పాతకక్షలకు రాజకీయ రంగు
- ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించిన పోలీసులు



వాగివేడులో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూన్ 6: వాగివేడులో రెండు వేర్వేరు ఘర్షణలు చోటు చేసుకున్నాయి. డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి కథనం మేరకు వాగివేడు దళితవాడకు చెందిన మహేశ్వరి వలంటీరుగా పనిచేసి ఇటీవల రాజీనామా చేసింది. ఆమె ఓ ప్రైవేటు సెల్‌ఫోన్ కర్మాగారంలో రైడా పనిచేసేది. అదే గ్రామానికి చెందిన నాగేంద్ర దంపతులు మహేశ్వరి పనిచేసే సెల్‌ఫోన్ కార్మికులుగా ఉండేవారు. ఆరునెలల క్రితం కంపెనీ నుంచి నాగేంద్ర దంపతులను తొలగించారు. దాంతో ఇరువరి మధ్య విబేధాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో బుధవారం మహేశ్వరి ఇంటికి తాళం వేసి బంధువుల వద్దకు వెళ్లింది. నాగేంద్ర మహేశ్వరి ఇంటికి వెళ్లి తలుపులను పగులగొట్టే ప్రయత్నం చేశాడు. దీనిపై ఇరు కుటుంబాలూ ఘర్షణ పడ్డాయి. దాంతో రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మరో సంఘటనలో వాగివేడు దళితవాడకు చెందిన పృథ్వీ ఇటీవల వలంటీరుగా రాజీనామా చేశాడు. ఇతని ఇంటి పక్కన వ్యవసాయ భూములున్నాయి. ఆ భూములకు చెందిన వెంకటరమణ అనే వ్యక్తితో పృథ్వీకి దారి విషయమై పాతకక్షలు ఉన్నాయి. బుధవారం రాత్రి పృథ్వీ ఇంటి వద్ద వెంకటరమణ దారికి అడ్డుగా ముళ్లకంచె, పాత ట్రాక్టర్ చక్రాలను వేశాడు. దాంతో వెంకటరమణ పొలానికి వెళ్లే దారికి పృథ్వీ ముళ్లకంచెతో అడ్డువేశాడు. దీంతో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు చేరుకుని వీరిని అదుపు చేశారు. అనంతరం డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి పోలీసు బలగాలతో వాగివేడులో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతకక్షలకు రాజకీయ రంగులు పులమడం తగదని సూచించారు.

అంగన్‌వాడీలు అమ్మలా ఆదరించాలి



లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ జయలక్ష్మి

పిచ్చాటూరు, జూన్ 6: ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలు చిన్నారులకు మమతలు పంచే తల్లులుగా కొనసాగితే ప్రభుత్వం ఆశించిన ఫలితం వస్తుందని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ అన్నా జయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండలంలోని అడవి కండ్రిగ, గజ సింగరాజపురం, ఎస్ఎస్‌బీ పేట, గోవర్ధనగిరి, ఏలూరు, కుప్పం కండ్రిగ, నారాయణరాజు కండ్రిగ అంగన్‌వాడీ కేంద్రాలను పీడీ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు అందుతున్న పౌష్టికాహారంపై గ్రామస్థులతో అడిగి ఆరా తీశారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం నుంచి పెరటి తోటల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని లబ్ధిదారులకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. రిజిస్టర్లు తనిఖీ చేసి కార్యకర్తల పని తీరుపై సంతృప్తి వ్యక్తపరచారు. సీడీపీవో శోభారాణి, సూపర్‌వైజర్ మారెమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పిల్లల తల్లిదండ్రులు లబ్ధిదారులూ పాల్గొన్నారు.

నీట్ ప్రతిభావంతురాలికి సన్మానం

వరదయ్యపాళెం, జూన్ 6: సిద్ధేశ్వరపురంలో బత్తెమ్మ,రామయ్య మనుమరాలు తరుణిమను గురువారం గ్రామస్థులు సన్మానించారు. నీట్-2024 ఫలితాల్లో తరుణిమ 556 మార్కులతో సత్తా చాటిందని గ్రామస్థులు ప్రశంసించారు. గిరి లాల్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, మోహన్‌యాదవ్, సుమన్ యాదవ్, శోభన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధితో ఒకరి మృతి

పుత్తూరు, జూన్ 6: మున్సిపాలిటీ పరిధిలోని నందిమంగళం పంచాయతీలో అతిసార వ్యాధితో రాజగోపాల్ ఆచారి (70) రెండు రోజుల క్రితం మరణించాడు. మరికొందరు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. నందిమంగళం గ్రామస్థులు వ్యాధి బారిన పడి కోలుకుంటుండగా గురువారం పక్కనే వున్న దళితవాడలోనూ వ్యాధి లక్షణాలతో కొందరు బాధపడుతున్నారు. దళితవాడకు చెందిన పది మంది బాధితుల్లో ఐలయ్య, లలిత, చిన్నికన్నమ్మ చికిత్స పొందుతున్నారు. ఒకే మంచినీటి ట్యాంకు ద్వారా వీరందరికీ తాగునీర ంఅందిస్తున్నారు. అంకాళమ్మ తిరునాళ్ల తర్వాత వ్యాధి లక్షణాలు బయటపడ్డాయి. కలుషిత నీరా, ఆహారమా అన్నది తేల్చాల్సివుంది. వైద్యాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి వెంకటేశ్ గురువారం మున్సిపల్ అధికారులను కోరారు.

చంద్రబాబుకు శ్రీవారి ప్రసాదాలు



చంద్రగిరి, జూన్ 6: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును చంద్రగిరి మండలానికి చెందిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు గురువారం ఉండవల్లిలోని ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎన్నికల కురుక్షేత్రంలో మరెవ్వరికీ సాధ్యం కాని అద్భుత విజయం సాధించి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

రేణిగుంట-కాట్పాడి రైల్వే సెక్షన్‌లో తనిఖీలు

తిరుపతి(ఆటోనగర్), జూన్ 6: రేణిగుంట-కాట్పాడి రైల్వే సెక్షన్‌లో గురువారం దక్షిణ మధ్య రైల్వే చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ మాధవి పలు ప్రాంతాలను తనిఖీ చేశారు. రేణిగుంటలో ఉదయం బయల్దేరి తిరుపతి, పాకాల, చిత్తూరు మీదుగా దక్షిణ మధ్య రైల్వే సరిహద్దులో ఉన్న బొమ్మసముద్రం స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. స్టేషన్ మాస్టర్ కార్యాలయంలో రైళ్ల రాకపోకలు, భద్రత అంశాలను ఆమె తనిఖీ చేశారు. అనంతరం పాకాల రైల్వే యార్డ్‌లోని 62వ ఎల్‌సీ గేటు నిర్వహణ తీరును పరిశీలించి, ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ముంగిలపట్టు-చంద్రగిరి రైల్వే స్టేషన్‌ల మధ్య వున్న వంతెనను తనిఖీ చేసిన అనంతరం తిరుపతి చేరుకున్నారు. శుక్రవారం రేణిగుంట రైల్వే స్టేషన్‌లోని యార్డును పరిశీలిస్తారు. అనంతరం సికింద్రాబాద్ వెళతారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ డివిజన్ అధికారులు సుధాకర్, లక్ష్మీనాయక్, సూర్యనారాయణ, చంద్రశేఖర్, తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, సురేష్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

గాలి భాను ప్రకాష్‌కు అభినందనలు



భానుప్రకాష్‌తో పార్టీ నాయకులు

వడమాలపేట, జూన్ 6: నగరి ఎమ్మెల్యేగా ఎన్నికైన గాలి భాను ప్రకాష్‌కు మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం తిరుపతిలోని ఆయన నివాసంలో టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. వడమాలపేట మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఆరు వేల పైచిలుకు ఓట్ల మెజారిటీ రావడంతో సంతోషకరమని గాలి భాను ప్రకాష్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ పాలక మండలి సభ్యుల రాజీనామా

పుత్తూరు, జూన్ 6 : పుత్తూరు లోని శ్రీ సదాశివేశ్వరస్వామి ఆలయ పాలక మండలి సభ్యులు గురువారం ఆలయ ఈఓకు రాజీనామా లేఖలను అందించారు. వైసీపీ ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామాలు చేస్తున్నామని లేఖలో చైర్మన్ రమేష్‌బాబు పేర్కొన్నారు.